manavishwam.com

# మన విశ్వం

VOICE OF THE PEOPLE-POWER OF TRUTH

తెలుగు వార్తా దినపత్రిక

MANAVISHWAM TELUGU DAILY

వరంగల్ | సంపుటి : 01 | సంచిక : 24 | శనివారం, జూలై 11 2026 | పేజీలు - 8 | వెల : 5/-

**మంచిమాట**

కుళ్ళిన పండ్ల మధ్య మంచి పండును ఉంచితే అది కూడా చెడిపోతుంది. చుట్టూ చెడ్డ మనుషులు ఉంటే మనిషి పరిస్థితి కూడా అంతే.

### పారిశ్రామికీకరణకు

# ‘వేగం’ పెంచాలి!

- పెట్టుబడుల ఆకర్షణే ప్రధాన లక్ష్యం
- ఉపాధి కల్పనపై ప్రత్యేక దృష్టి పెట్టండి
- ఉన్నతాధికారుల సమీక్షలో సీఎస్ సంజయ్ జాజు ఆదేశం



**హైదరాబాద్, జూలై 10 (మన విశ్వం ):** రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతిని పరుగులు పెట్టించడంతో పాటు, కొత్త పెట్టుబడులను ఆకర్షించడం, తద్వారా యువతకు పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు కల్పించడమే ధ్యేయంగా అధికారులు కదలాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) సంజయ్ జాజు ఆదేశించారు. సచివాలయంలో శుక్రవారం పరిశ్రమలు, వాణిజ్య శాఖ ఉన్నతాధికారులతో కలిసి ఆయన కీలక పారిశ్రామిక మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల పురోగతిపై సుదీర్ఘంగా సమీక్షించారు.?ఈ సందర్భంగా రాష్ట్రంలో ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న భారత్ ఫ్యూచర్ సిటీ, జహీరాబాద్ పారిశ్రామిక నగరం, కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు తదితర వ్యూహాత్మక ప్రాజెక్టుల ప్రస్తుత స్థితిగతులను అధికారులు సీఎస్‌కు వివరించారు. తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ (టీజీఐఐసీ) ఆధ్వర్యంలో జరుగుతున్న పనులు, పెట్టుబడి అవకాశాలు, ఆయా ప్రాజెక్టుల పూర్తికి నిర్దేశించుకున్న గడువులపై ఒక సమగ్ర నివేదికను ఆయనకు సమర్పించారు.

**గడువులోగా ప్రాజెక్టులు పూర్తి కావాలి**

ప్రపంచస్థాయి మౌలిక వసతులు, పరిశ్రమల స్థాపనకు అనుకూలమైన వాతావరణాన్ని కల్పించడం ద్వారా దేశంలోనే తెలంగాణను పెట్టుబడులకు అత్యంత ప్రాధాన్య వేదికగా నిలపాలని సంజయ్ జాజు పేర్కొన్నారు.ప్రభుత్వ

మిగతా 2లో...




### రాముడి సాక్షిగా రేవంత్ శపథం: 2029లో 117 సీట్లతో

# మళ్లీ మాదే పీఠం!

- ఖమ్మం రైతు ఆశీర్వాద సభలో సీఎం ధీమా
- రూ.1,009 కోట్ల రైతు భరోసా తుది విడత నిధుల విడుదల
- బీఆర్ఎస్,బీజేపీలపై తీవ్ర విమర్శలు.. హరీశ్‌రావుకు సవాల్

**ఖమ్మం, జూలై 10 (మన విశ్వం):** రాష్ట్ర రాజకీయాల్లో మరోసారి సంచలన వ్యాఖ్యలతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చర్చనీయాంశమయ్యారు. ఖమ్మం జిల్లా చింతకాని మండలంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో నిర్వహించిన భారీ ‘రైతు ఆశీర్వాద సభ’ లో పాల్గొన్న సీఎం, రైతు భరోసా పథకం వానాకాలం సీజన్‌కు సంబంధించిన తుది విడతగా రూ. 1009 కోట్లను రైతుల ఖాతాల్లో నేరుగా విడుదల చేశారు. ఈ చెల్లింపుతో కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు 74లక్షల మంది రైతులకు చెందిన 1.45కోట్ల ఎకరాలకు రూ. 8759 కోట్ల పెట్టుబడి సాయం అందించినట్లు ప్రకటించారు. సభలో ప్రసంగించిన సీఎం రేవంత్ రెడ్డి ఖమ్మం జిల్లాతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ, 2023లో పొంగులేటి శ్రీనివాసరెడ్డి కాంగ్రెస్‌లో చేరిన తర్వాత జిల్లాలో ఏర్పడిన రాజకీయ మార్పే రాష్ట్రంలో అధికార మార్పుకు నాంది పలికిందన్నారు. అప్పట్లో ప్రజలు కాంగ్రెస్‌కు అండగా నిలిచినట్లే, ఇప్పుడు ప్రజాపాలనకు ఆశీర్వాదం అందించేందుకు రైతులు భారీగా తరలివచ్చారని పేర్కొన్నారు.

**‘బీఆర్ఎస్‌కు ఇక పునర్జన్మ లేదు’**

తెలంగాణలో బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వచ్చే పరిస్థితి లేదని సీఎం స్పష్టం చేశారు. గత ఎన్నికల్లో ప్రజలు ఆ పార్టీని తిరస్కరించారని, ఇక రాష్ట్ర రాజకీయాల్లో బీఆర్ఎస్‌కు స్థానం ఉండదని వ్యాఖ్యానించారు. ఎన్నికల ముందు కాంగ్రెస్‌కు 65 సీట్లు వస్తాయని తాను చెప్పగా, దాదాపు అదే ఫలితం వచ్చిందని, అనంతరం జరిగిన ఉప ఎన్నికల్లోనూ ప్రజలు కాంగ్రెస్‌కే మద్దతు ఇచ్చారని

మిగతా 2లో...

### రేవంత్ సర్కారుది

# ‘జలద్రోహం’

- హరీష్ రావు ధ్వజం
- రాజకీయ కక్షతోనే కాళేశ్వరం పంపులు బంద్.. ఏపీకి గోదావరి నీళ్ల ధారాదత్తం
- చంద్రబాబు రుణం తీర్చుకునేందుకేనా?
- ‘ఎక్స్’ వేదికగా మాజీ మంత్రి నిప్పులు



**హైదరాబాద్, జూలై 10(మన విశ్వం):** రాజకీయ కక్షతో కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ రైతాంగాన్ని కరువు కోరల్లోకి నెడుతోందని, కాళేశ్వరం ప్రాజెక్టును పక్కనబెట్టి రాష్ట్రానికి ‘జలద్రోహం’ చేస్తోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీష్ రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వైఖరి తెలంగాణకు శాపంగా, ఆంధ్రప్రదేశ్‌కు వరంగా మారిందని ఆయన విమర్శించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ‘ఎక్స్’ (ట్విట్టర్) వేదికగా సీఎం రేవంత్ రెడ్డిపై ప్రశ్నల వర్షం కురిపించారు. మాట తప్పడం, పార్టీలు మారడం రేవంత్ రాజకీయ సంస్కృతి కావొచ్చని, కానీ తనది కాదని హరీష్ రావు హితవు పలికారు. భద్రాద్రి

మిగతా 2లో...

### కాళేశ్వరం నీటిపై

# రాజీ లేదు

- రైతుల కోసం అవసరమైతే ఎంత దూరమైనా పోరాడుతాం
- మేడిగడ్డలో నీటి నిల్వ వద్దు.. వృథాగా వెళ్తున్న వరదను ఎత్తిపోయండి
- అవినీతి విచారణ పేరుతో మోటార్లు ఆపడం దుర్మార్గం
- తెలంగాణే నా ఫస్ట్ ప్రయారిటీ’.. మల్కాజ్‌గిరి ఎంపీ సంచలన వ్యాఖ్యలు



**హైదరాబాద్ , జూలై 10 (మన విశ్వం):** రాష్ట్ర ప్రయోజనాలు, రైతుల సంక్షేమం విషయంలో తాను ఎలాంటి రాజీ పడే ప్రసక్తే లేదని, తన పంథా ఎప్పటికీ ‘తెలంగాణే ఫస్ట్’ అని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ స్పష్టం చేశారు. తాను

మిగతా 2లో...

### ఓఆర్ఆర్ భద్రతకు ఏఐ

# సాంకేతికత

- ప్రమాదాల నివారణకు సమన్వయ చర్యలు
- 80 ప్రమాదకర ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి





**హైదరాబాద్, జూలై 10 (మన విశ్వం ):** హైదరాబాద్ మహానగరం చుట్టూ ఉన్న ఔటర్ రింగ్ రోడ్డుపై రోడ్డు ప్రమాదాలను తగ్గించి ప్రజల భద్రతను మరింత బలోపేతం చేయడానికి అత్యాధునిక సాంకేతికతను వినియోగించేందుకు చర్యలు చేపడుతున్నట్లు పోలీసు కమిషనర్ సజ్జనార్ తెలిపారు. ట్రాఫిక్ నిర్వహణ, నిబంధనల అమలు, ప్రమాదాల నివారణపై అన్ని శాఖల సమన్వయంతో ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నామని పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం తెలంగాణ ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌లో కీలక సమన్వయ సమావేశం

మిగతా 2లో...

### కలెక్టర్ మేడం.. తహసీల్దార్‌పై

# చర్యలు ఎప్పుడూ?

- కోర్టు వివాదంలో ఉన్న భూమికి మ్యుటేషన్ చేశారనే ఆరోపణలు..
- ఫిర్యాదులు చేసినా స్పందన లేదంటున్న బాధితులు
- విచారణ ఆలస్యంపై ప్రశ్నలు..రెవెన్యూ వ్యవస్థపై నమ్మకం దెబ్బతింటోందన్న స్థానికులు




**హనుమకొండ, జులై 10 (మన విశ్వం):** పరకాల తహసీల్దార్‌పై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో జిల్లా యంత్రాంగం ఇంకా చర్యలు తీసుకోకపోవడం చర్చనీయాంశంగా మారింది. కోర్టు వివాదంలో ఉన్న భూమికి నిబంధనలకు విరుద్ధంగా మ్యుటేషన్ చేసి పట్టాదారు పాస్‌పుస్తకాలు జారీ చేశారంటూ బాధితులు ఆరోపిస్తూ, ఆధారాలతో సహా ఫిర్యాదులు చేసినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి విచారణ గానీ, శాఖాపరమైన చర్యలు గానీ కనిపించకపోవడంపై వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.హన్మకొండ జిల్లా పరకాల మండలం మాదారం రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్--665లో ఉన్న భూమి న్యాయస్థానంలో వివాదంలో ఉందని, ఈ భూమిపై ఎలాంటి మ్యుటేషన్ చేయవద్దని మార్చి నెలలోనే లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు బాధితులు చెబుతున్నారు. అయినప్పటికీ మ్యుటేషన్ ప్రక్రియ పూర్తై పట్టాదారు పాస్ పుస్తకాలు జారీ అయ్యాయని వారు ఆరోపిస్తున్నారు.ఈ వ్యవహారంపై పలుమార్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా ఇప్పటివరకు బాధ్యులపై చర్యలు తీసుకోలేదని బాధితులు పేర్కొంటున్నారు.

**ఆరోపణలు నిజం కాకపోతే విచారణతో స్పష్టం చేయాలి**

ఈ వ్యవహారంలో తహసీల్దార్ ఎలాంటి నిబంధనల ఉల్లంఘన చేయలేదని అధికారుల అభిప్రాయం అయితే, సమగ్ర విచారణ నిర్వహించి ప్రజల ముందుకు వాస్తవాలను తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు. మరోవైపు ఆరోపణలు నిజమని తేలితే బాధ్యులపై శాఖాపరమైన కఠిన చర్యలు

మిగతా 2లో...

### బోనాలకు పకడ్బందీ

# ఏర్పాట్లు

- అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి: మంత్రి కొండా సురేఖ
- భక్తులకు పూర్తి స్థాయి సౌకర్యాలు కల్పించాలని ఆదేశం



**హైదరాబాద్, జూలై 10 (మన విశ్వం):** ఆషాఢ బోనాల ఉత్సవాలు తెలంగాణ గంగా--జమున సంస్కృతికి ప్రతీకగా నిలుస్తాయని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. గోల్కొండ కోటలోని జగదాంబిక మహంకాళి ఆలయంలో

మిగతా 2లో...

# గవర్నర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ప్రధాన కార్యదర్శి

**- లోక్‌భవన్‌లో శివప్రతాప్ శుక్లాతో భేటీ**
**- బాధ్యతలు చేపట్టిన అనంతరం మర్యాదపూర్వక సమావేశం**



హైదరాబాద్, జూలై 10 (మన విశ్వం ): తెలంగాణ ప్రభుత్వ నూతన ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు శుక్రవారం హైదరాబాద్‌లోని లోక్‌భవన్‌లో రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్లాను మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఈ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సంజయ్ జాజుకు గవర్నర్ శుభాకాంక్షలు తెలియ జేశారు. రాష్ట్ర పరిపాలనను సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వ యంత్రాంగంతో సమన్వయంగా పనిచేయాలని ఆకాంక్షించారు. తెలంగాణ అభివృద్ధి, ప్రజా సంక్షేమ కార్యక్రమాల అమలులో ప్రధాన కార్యదర్శి కీలక పాత్ర పోషించాలని సూచించినట్లు సమాచారం. ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం గవర్నర్‌ను మర్యాదపూర్వకంగా కలవడం పరిపాలనా సంప్రదాయంలో భాగమని అధికారులు తెలిపారు. రాష్ట్ర పరిపాలనకు సంబంధించిన పలు అంశాలపై కూడా ఇరువురి మధ్య సంక్షిప్తంగా చర్చ జరిగినట్లు తెలిసింది. భారత పరిపాలనా సేవలో విశేష అనుభవం కలిగిన సంజయ్ జాజు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో వివిధ కీలక బాధ్యతలు నిర్వహించారు. ఆయన నియామకంతో తెలంగాణ ప్రభుత్వ పరిపాలనా వ్యవస్థ మరింత సమర్థవంతంగా పనిచేస్తుందనే ఆశాభావం వ్యక్తమవుతోంది. లోక్‌భవన్‌లో జరిగిన ఈ మర్యాదపూర్వక భేటీ అనంతరం గవర్నర్‌కు సంజయ్ జాజు కృతజ్ఞతలు తెలియజేశారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజలకు మెరుగైన పాలన అందించేందుకు ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

# వెనుకబడిన వర్గాలకే మా తొలి ప్రాధాన్యం

**- నాయకపోడ్‌లకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పిస్తాం**
**- ఆదివాసీల అభ్యున్నతే తెలంగాణ రక్షణ సేన లక్ష్యం**
**- కల్వకుంట్ల కవిత**



అశ్వారావుపేట, జూలై 10 (మన విశ్వం ): అశ్వారావుపేట నియోజకవర్గంలోని అశ్వారావుపేట మండలం కొత్తగంగారం నాయకపోడ్ గూడెంలో తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత పర్యటించి గ్రామ ప్రజలతో ముఖాముఖి సమావేశమయ్యారు. గ్రామస్థుల సమస్యలను అడిగి తెలుసుకున్న ఆమె, నాయకపోడ్ సమాజానికి అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. రాష్ట్రంలో వెనుకబడిన వర్గాలకు రాజకీయ, సామాజిక, ఆర్థిక న్యాయం చేయడమే తమ పార్టీ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన కవిత, రాష్ట్రంలో ఇప్పటికే ఎన్నో రాజకీయ పార్టీలు ఉన్నప్పటికీ ప్రజల జీవితాల్లో నిజమైన మార్పు తీసుకురావాలనే ఉద్దేశంతోనే తెలంగాణ రక్షణ సేనను స్థాపించినట్లు తెలిపారు. పాత రాజకీయాలకు భిన్నంగా సామాజిక న్యాయం, సమాన అవకాశాలు, అణగారిన వర్గాల అభ్యున్నతే పార్టీ సిద్ధాంతమని చెప్పారు. ముఖ్యంగా ఆదివాసీలు, గిరిజనులు, ఎస్సీలు, మైనారిటీలు, మహిళలు, యువతకు రాజకీయాల్లో తగిన ప్రాధాన్యం కల్పించేందుకు కట్టుబడి ఉన్నామని పేర్కొన్నారు.
నాయకపోడ్ సమాజం ఇప్పటికీ తమ గుర్తింపు కోసం పోరాడాల్సిన పరిస్థితి దురదృష్టకరమని కవిత అన్నారు. జనాభా లెక్కల్లో కూడా తమ జాతికి సరైన గుర్తింపు లేదని స్థానికులు చెబుతున్న విషయాన్ని ప్రస్తావిస్తూ, ప్రతి జాతికి తన అస్థిత్వం, గౌరవం ఉండాలని చెప్పారు. నాయకపోడ్ సమాజం నుంచి ఎమ్మెల్యేలు, జెడ్పీటీసీలు, ఇతర ప్రజాప్రతినిధులు రావాల్సిన అవసరం ఉందని, తమ పార్టీ నుంచే ఆ ప్రక్రియకు శ్రీకారం చుడతామని హామీ ఇచ్చారు. అవసరమైతే వారి హక్కుల కోసం ఢిల్లీ వరకు వెళ్లి పోరాడతామని ప్రకటించారు. విద్య, వైద్యం, ఉపాధి, రైతు సంక్షేమం, యువత స్వయం ఉపాధి తమ పార్టీ పాంచజన్య కార్యక్రమంలోని ప్రధాన అంశాలని కవిత వివరించారు. ఆదివాసీ, గిరిజన విద్యార్థులకు ఉచిత విద్య, నాణ్యమైన వైద్యం అందుబాటులో ఉండాలని, ప్రభుత్వ స్కాలర్‌షిప్‌లు సకాలంలో అందాలని అన్నారు. యువత వ్యాపారాలు ప్రారంభించేందుకు తక్కువ వడ్డీతో రుణాలు అందించే విధానాన్ని తీసుకువస్తామని, రైతులకు ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి గౌరవప్రదమైన సేవలు అందిస్తామని హామీ ఇచ్చారు. రైతును నిజంగా రాజుగా నిలబెట్టే పాలన అందిస్తామని పేర్కొన్నారు.
ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనుల హక్కులను పరిరక్షించే జీవో నంబర్--3ను కచ్చితంగా అమలు చేయాలని కవిత డిమాండ్ చేశారు. ఐటీడీఏ ఏర్పాటు, ఆదివాసీ ప్రాంతాల్లో విద్యుత్, రహదారులు, తాగునీరు వంటి మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని విమర్శించారు. కేంద్రం నుంచి వచ్చే నిధులను ఆదివాసీల అభివృద్ధికే వినియోగించాలని, అన్ని వర్గాలకు వారి జనాభా నిష్పత్తి ప్రకారం అవకాశాలు, నిధులు దక్కాలని అన్నారు. సామాజిక న్యాయం సాధించినప్పుడే తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి పూర్తి అర్థం ఉంటుందని వ్యాఖ్యానించారు. మహిళలకు కూడా సమాన అవకాశాలు కల్పించడమే తమ లక్ష్యమని కవిత తెలిపారు. "ఇన్నాళ్లు అన్నల పాలన చూశారు... ఇప్పుడు ఒక అక్క పార్టీ ఎలా ఉంటుందో చూడండి" అంటూ ప్రజలను ఉద్దేశించి పిలుపునిచ్చారు. తమ పార్టీ ఏర్పడి 74 రోజులే అయినప్పటికీ ప్రజల ఆశీర్వాదంతో రాష్ట్రంలో ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా ఎదుగుతామని విశ్వాసం వ్యక్తం చేశారు. యువత, మహిళలు, రైతులు, ఆదివాసీలు తమతో కలిసి నడవాలని కోరుతూ, తెలంగాణ రక్షణ సేన అన్ని రాజకీయ పార్టీలకు భిన్నంగా ప్రజల కోసం పనిచేసే పార్టీగా నిలుస్తుందని స్పష్టం చేశారు.

# ఉప్పల్‌కు బస్తీ దవాఖానల వినతి



**- ఆరోగ్య మంత్రిని కలిసిన ఎమ్మెల్యే**
**- మెరుగైన వైద్య సేవల కోసం ప్రతిపాదన**

హైదరాబాద్, జూలై 10 (మన విశ్వం ): ఉప్పల్ నియోజకవర్గంలో బస్తీ దవాఖానలు ఏర్పాటు చేయాలని కోరుతూ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహను మర్యాదపూ ర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిం చేందుకు సంబంధించిన వినతిపత్రాన్ని మంత్రికి సమర్పించారు. ఉప్పల్ పరిధిలోని పలు కాలనీల్లో బస్తీ దవాఖానలు ఏర్పాటు చేస్తే పేద, మధ్యతరగతి ప్రజలకు ఆరోగ్య సేవలు మరింత చేరువ అవుతాయని ఎమ్మెల్యే వివరించారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి రావాల్సిన అవసరాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. బస్తీ దవాఖానల ద్వారా ఉచిత వైద్య పరీక్షలు, ప్రాథమిక చికిత్సలు, అవసరమైన మందులు సకాలంలో అందించవచ్చని, ప్రజలు చిన్నచిన్న ఆరోగ్య సమస్యల కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం ఉండదని ఎమ్మెల్యే పేర్కొన్నారు. వినతిపత్రాన్ని స్వీకరించిన మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రతిపాదనను సానుకూలంగా పరిశీలిస్తామని తెలిపారు. ప్రజల కు నాణ్యమైన వైద్య సేవలు అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. నియోజకవర్గ అవసరాలకు అనుగుణంగా ఆరోగ్య మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి తెలిపారు. అవసరమైన ప్రతిపాదనలపై సంబంధిత అధికారులతో చర్చించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తున్నారని ఈ సందర్భంగా ఇరువురు పేర్కొన్నారు.

# హుజూర్‌నగర్‌కు రూ.20 కోట్ల అభివృద్ధి పనులు

**- పబ్లిక్ స్కూల్‌తో పాటు పలు నిర్మాణాలకు శంకుస్థాపన**
**- మౌలిక వసతుల కల్పనకు మంత్రి శ్రీకారం**



హుజూర్‌నగర్, జూలై 10(మన విశ్వం ): హుజూర్‌నగర్ పట్టణంలోని రామస్వామి గుట్ట ప్రాంతంలో రూ.20 కోట్ల వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ప్రజలకు మెరుగైన విద్యా, సామాజిక, మౌలిక సదుపాయాలు కల్పించే లక్ష్యంతో ఈ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టు కింద తెలంగాణ పబ్లిక్ స్కూల్, అంగన్‌వాడీ కేంద్రం, కమ్యూనిటీ హాల్, సిమెంట్ కాంక్రీట్ రహదారులు, డ్రైనేజీ వ్యవస్థ, వీధి దీపాలు, పిల్లల ఆట స్థలం, షాపింగ్ కాంప్లెక్స్, ఆర్చి తదితర నిర్మాణాలను చేపట్టనున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పట్టణ అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ప్రజలకు అవసరమైన అన్ని మౌలిక వసతులను దశలవారీగా కల్పిస్తూ మెరుగైన జీవన వాతావరణాన్ని అందించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. విద్య, తాగునీరు, రహదారులు, పారిశుద్ధ్యం, ప్రజా సౌకర్యాల అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని పేర్కొన్నారు. అభివృద్ధి పనులను నాణ్యతతో, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ అభివృద్ధి పనులు పూర్తయితే స్థానిక ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి రావడంతో పాటు పట్టణ రూపురేఖలు మారనున్నాయని అధికారులు తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, స్థానిక నాయకులు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులకు స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

# ఓటరు సవరణపై సమీక్ష

**- కలెక్టర్లతో వీడియో సమావేశం**
**- వేగవంతమైన ప్రక్రియకు ఆదేశాలు**
**- ఎన్నికల సంఘం మార్గనిర్దేశం**




హైదరాబాద్, జూలై 10 (మన విశ్వం ): ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమం పురోగతిపై భారత ఎన్నికల సంఘం సీనియర్ డిప్యూటీ ఎన్నికల కమిషనర్ పవన్ కుమార్ శర్మ శుక్రవారం అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో సమావేశం నిర్వహించారు. ఢిల్లీ నుంచి నిర్వహించిన ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి పాల్గొని జిల్లాల వారీగా చేపడుతున్న కార్యక్రమాలను సమీక్షించారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియను వేగవంతంగా, పారదర్శకంగా పూర్తి చేయాలని ఎన్నికల సంఘం అధికారులకు సూచించింది. ఇంటింటి సర్వే, దరఖాస్తుల స్వీకరణ, వివరాల నమోదు వంటి అన్ని ప్రక్రియలను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించింది. అర్హులైన ప్రతి పౌరుడి పేరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సమావేశంలో సూచించారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సవరణ కార్యక్రమాన్ని సమర్థంగా నిర్వహించాలని పేర్కొన్నారు. వీడియో సమావేశంలో జిల్లాల వారీగా కార్యక్రమం పురోగతి, ఎదురవుతున్న సమస్యలు, వాటి పరిష్కార మార్గాలపై అధికారులు చర్చించారు. అవసరమైన చోట అదనపు చర్యలు చేపట్టి కార్యక్రమాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేయాలని ఎన్నికల సంఘం సూచించింది. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ రాజర్షి షా, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి మంద మకరందు, అదనపు కలెక్టర్ ఆర్.ఎస్. చిత్రు, జిల్లా రెవెన్యూ అధికారి స్రవంతి, ఆర్డీవో జగదీశ్వర్ రావు, డిప్యూటీ కలెక్టర్ వంశీకృష్ణ, కలెక్టరేట్ పర్యవేక్షకురాలు నలంద ప్రియ, తహసీల్దార్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు. ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసేందుకు ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేయాలని అధికారులకు సూచించారు. ప్రజలు కూడా ఈ కార్యక్రమానికి సహకరించి తమ ఓటరు వివరాలను సరిచూసుకోవాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

# ప్రజాస్వామ్యాన్ని కాపాడే బాధ్యత ప్రతి ఓటర్ పై ఉంది



**- ఎస్.ఐ.ఆర్ పై అవగాహన కరపత్రాలు ఆవిష్కరించిన జిల్లా అదనపు కలెక్టర్ కె. అనిల్ కుమార్**

మహబూబాబాద్ జూలై 10 (మన విశ్వం) : ప్రజాస్వామ్య దేశంలో ప్రతి ఓటర్ ఒక కాపాడదారుడేనని మహబూబాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ కె. అనిల్ కుమార్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ అదనపు కలెక్టర్ కార్యాలయంలో ఆరోగ్య మిత్ర ఆధ్వర్యంలో ఎస్.ఐ.ఆర్ పై జిల్లావ్యాప్తంగా చేపట్టే అవగాహన కార్యక్రమాల కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎస్.ఐ.ఆర్ ప్రక్రియపై ప్రజలకు సులభంగా అర్థమయ్యే విధంగా కరపత్రాల ద్వారా ప్రచారం చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. ఓటు హక్కు విలువను ప్రతి ఒక్కరూ గుర్తించి, ఎన్నికల ప్రక్రియలో చురుగ్గా పాల్గొనాలని కోరారు.
ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు మద్దినేని గుట్టయ్య, ధర్మారపు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు డిజిటల్ విద్య అందించడమే లక్ష్యం

**- ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి నిరంతర కృషి**
**- ఎం ఈ ఓ బుధరపు శ్రీనివాస్**



పెద్దవంగర, జూలై 10(మన విశ్వం): ప్రజాప్రతినిధిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత అందుకున్న తొలి జీతాన్ని సమాజ సేవకు వినియోగిస్తూ పెద్దమనసు చాటుకున్నారు పెద్దవంగర గ్రామ సర్పంచ్ ముద్దసాని పారిజాత సురేష్. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన విద్యను అభ్యసించేలా తన మొదటి జీతంతో ఒక స్మార్ట్ టీవీని కొనుగోలు చేసి పాఠశాలకు బహుకరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి ముదారపు శ్రీనివాస్, సర్పంచ్ ముద్దసాని పారిజాత సురేష్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థికి ప్రైవేట్ పాఠశాలలకు ఏమాత్రం తీసిపోని నాణ్యమైన విద్య అందించాలనే ఉద్దేశంతో ఈ స్మార్ట్ టీవీని అందజేస్తున్నట్లు తెలిపారు. నేటి డిజిటల్ యుగంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ బోధన సాగితే విద్యార్థుల్లో నేర్చుకునే ఆసక్తి పెరగడంతో పాటు పాఠాలను సులభంగా అర్థం చేసుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. గ్రామ అభివృద్ధితో పాటు విద్యాభివృద్ధికి కూడా సమాన ప్రాధాన్యత ఇస్తానని, ప్రభుత్వ పాఠశాలల్లో అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు తన వంతు సహకారం ఎల్లప్పుడూ కొనసాగుతుందని ఆమె స్పష్టం చేశారు. విద్యార్థుల భవిష్యత్తు బాగుంటేనే గ్రామ భవిష్యత్తు కూడా బాగుంటుందనే సంకల్పంతో ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.సత్యనారాయణ మాట్లాడుతూ.. స్మార్ట్ టీవీ ద్వారా డిజిటల్ పాఠాలు, విద్యా వీడియోలు, ఇంటరాక్టివ్ లెర్నింగ్ కార్యక్రమాలను విద్యార్థులకు అందించడానికి ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. సర్పంచ్ చేసిన ఈ దాతృత్వాన్ని అభినందిస్తూ, ఇతర ప్రజాప్రతినిధులకు కూడా ఇది ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు. తల్లిదండ్రులు, విద్యార్థులు కూడా సర్పంచ్ ముద్దసాని పారిజాత సురేష్ ను అభినందిస్తూ తొలి జీతాన్ని విద్య కోసం వినియోగించడం అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు ముద్దసాని సురేష్, ఉపసర్పంచ్ అనపురం వినోద్, ఉపాధ్యాయురాలు సౌభాగ్య, తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్‌లో కండౌ కేంద్రం

- కృత్రిమ మేధకు ఊతం
- చిప్ రూపకల్పన కేంద్రం
- కేటీఆర్ ప్రారంభోత్సవం



**హైదరాబాద్, జూలై 10 (మన విశ్వం ):** స్విట్జర్లాండ్‌కు చెందిన కండౌ ఏఐ సంస్థ భారత కార్యకలాపాలను హైదరాబాద్‌లో ప్రారంభించింది. ఈ కార్యక్రమాన్ని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ప్రారంభించారు. ప్రపంచ మార్కెట్ కోసం తదుపరి తరం కృత్రిమ మేధ, అర్ధవాహక సాంకేతికతలను అభివృద్ధి చేయడంలో ఈ సంస్థ కీలక పాత్ర పోషించనుంది. తెలంగాణకు చెందిన సృజన్ లింగా సహ వ్యవస్థాపకుడిగా ఉన్న కండౌ ఏఐ, ప్రపంచ ప్రఖ్యాత పెట్టుబడిదారుల నుంచి 225 మిలియన్ డాలర్ల నిధులు సమీకరించింది. భారతదేశంలో తన చిప్ రూపకల్పన ప్రధాన కేంద్రంగా హైదరాబాద్‌ను ఎంపిక చేసుకోవడం రాష్ట్ర సాంకేతిక రంగానికి మరో కీలక ముందడుగుగా భావిస్తున్నారు. ప్రస్తుతం 150 మందికి పైగా ఇంజినీర్లు అత్యాధునిక చిప్ రూపకల్పనలో పనిచేస్తున్నారని సంస్థ వెల్లడించింది. కృత్రిమ మేధ, అర్ధవాహక రంగాల్లో ప్రపంచ స్థాయి పరిష్కారాల అభివృద్ధిపై ఈ బృందం దృష్టి సారించనుంది.హైదరాబాద్‌లోని నైపుణ్యం కలిగిన మానవ వనరులు, ఆవిష్కరణలకు అనుకూలమైన వాతావరణం, సాంకేతిక రంగంలో రాష్ట్రం సాధించిన పురోగతిపై ప్రపంచ సంస్థలకు ఉన్న విశ్వాసానికి ఇది మరో నిదర్శనమని కేటీఆర్ పేర్కొన్నారు. కండౌ ఏఐ వంటి సంస్థలు రాష్ట్రానికి రావడం వల్ల యువ ఇంజినీర్లకు మరిన్ని ఉద్యోగ అవకాశాలు లభించడంతో పాటు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధికి ఊతం లభిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. హైదరాబాద్ నుంచే ప్రపంచ భవిష్యత్ కృత్రిమ మేధ సాంకేతికతను నిర్మించే లక్ష్యంతో ముందుకు సాగుతున్న కండౌ ఏఐ బృందానికి కేటీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సంస్థ ప్రపంచ సాంకేతిక రంగంలో మరింత విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

# ప్రభుత్వం సిపిఎస్ విధానాన్ని రద్దు చేయాలి..



- తాపస్ ఉపాధ్యాయ సంఘం సభ్యత్వ నమోదు
-టి పియుఎస్ మండల అధ్యక్షుడు బండా శ్రీనివాస్ రెడ్డి

**దంతాలపల్లి,జులై 10( మన విశ్వం ):** మండలంలో వివిధ పాఠశాలల లో సభ్యత్వం నమోదు కార్యక్రమం నిర్వహించడం జరిగింది. కార్యక్రమంలో నమోదు సందర్భంగా ఉద్యోగ ఉపాధ్యాయులకు 51 శాతం పిఆర్సి నీ వెంటనే ప్రకటించాలని,పెండింగ్ లో ఉన్నటువంటి ఆరు డి ఏ లను వెంటనే విడుదల చేయాలని, మేనిఫెస్టోలో ప్రకటించినట్లుగా సి పి ఎస్ ను వెంటనే రద్దు చేసి, ఓ పి ఎస్ ను అమలు చేయాలని, విద్యా శాఖలో వెంటనే 190 జీవోను అమలుపరచాలని, కేజీబీవీ, ఎస్ ఎస్ఎ ఉద్యోగులకు సమ్మె కాలపు వేతనాన్ని అందించి మినిమం టైం స్కేల్ ను అమలు చేయాలని పెండింగ్ బిల్లులు అన్నింటిని వెంటనే విడుదల చేయాలని,ఉద్యోగ, ఉపాధ్యాయుల హెల్త్ కార్డ్ ల విషయంలో పారదర్శకత పాటించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.
అలాగే దశల వారి ఉద్యమంలో భాగంగా జులై 14 న జిల్లా కేంద్రంలో నిర్వహించే ధర్నా కు పెద్ద ఎత్తున ఉపాధ్యాయుల పాల్గొనాలి కోరారు కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి మహేందర్, సంఘ బాధ్యులు హరిబాబు టి పి యు ఎస్ జిల్లా ఉపాధ్యక్షులు నాగిరెడ్డి ఉపాధ్యాయులు పాల్గొన్నారు

# ఎస్ఐఆర్‌లో ప్రతి ఒక్కరూ పాల్గొనాలి

- ఓటు హక్కుతో ప్రజాస్వామ్యం మరింత బలోపేతం
- అవగాహనతో సమగ్ర ఓటరు జాబితా రూపొందిద్దాం
- ఎమ్మెల్యే కేపీ వివేకానంద్



**హైదరాబాద్, జూలై 10 (మన విశ్వం ):** కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో ప్రతి ఓటరు బాధ్యతాయుతంగా పాల్గొనాలని బీఆర్ఎస్ శాసనసభాపక్ష విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ పిలుపునిచ్చారు. గాజులరామారం డివిజన్‌లోని మంజూర్‌బస్తీలో నిర్వహించిన ఎస్ఐఆర్ అవగాహన కార్యక్రమంలో ఆయన అధికారులు, బూత్ స్థాయి అధికారులు, బూత్ స్థాయి ప్రతినిధులు, స్థానిక ప్రజలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల భాగస్వామ్యంతోనే సమగ్ర ఓటరు జాబితా రూపొందుతుందని, ప్రతి ఓటు ప్రజాస్వామ్యానికి ఎంతో విలువైనదని అన్నారు. ప్రతి ఒక్కరు స్వచ్ఛందంగా ఎస్ఐఆర్ కార్యక్రమంలో పాల్గొని తమ పేరు ఓటరు జాబితాలో సక్రమంగా నమోదైందో లేదో నిర్ధారించుకోవాలని సూచించారు.ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమం దేశవ్యాప్తంగా ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించ బడుతోందని తెలిపారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి తెలంగాణలో స్థిరపడిన అర్హులైన పౌరులు కూడా తమ వివరాలను నమోదు చేసుకుని ఓటు హక్కు పొందాలని కోరారు. బూత్ స్థాయి అధికారులు, బూత్ స్థాయి ప్రతినిధులు కార్యక్రమంపై పూర్తి అవగాహన పెంపొందించుకుని ప్రజలకు సరైన సమాచారం అందించాలని సూచించారు. ఓటరు జాబితాలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా ప్రతి ఇంటికి వెళ్లి అవసరమైన సహాయం అందించాలని కోరారు.
2002 ఓటరు జాబితాను ప్రామాణికంగా తీసుకుని సవరణ ప్రక్రియ కొనసాగుతోందని పేర్కొన్న ఆయన, పాత ఓటరు వివరాలను అధికారులకు అందించి సమగ్ర జాబితా రూపొందించడంలో ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఆఫ్‌లైన్‌తో పాటు ఆన్‌లైన్‌లో కూడా ఈ ప్రక్రియ అందుబాటులో ఉండడం ప్రజలకు మరింత సౌకర్యవంతంగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక అధికారులు, బూత్ స్థాయి అధికారులు, బూత్ స్థాయి ప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, మంజూర్‌బస్తి ప్రజలు పాల్గొన్నారు. ఓటు హక్కును వినియోగించుకోవడంలో ప్రతి ఒక్కరూ చైతన్యంతో వ్యవహరించాలని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ సూచించారు.

# బాల కార్మిక వ్యవస్థపై ఉక్కుపాదం




- 10 రోజుల్లో 34 మంది చిన్నారుల రక్షణ
- 22 కేసులు నమోదు చేసిన మెదక్ పోలీసులు

**మెదక్, జూలై 10 (మన విశ్వం ):** బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనే లక్ష్యంగా చేపట్టిన ఆపరేషన్ ముస్కాన్--12లో మెదక్ జిల్లా పోలీసులు కీలక పురోగతి సాధించారు. గత పది రోజుల్లో వివిధ ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించి 34 మంది బాల కార్మికులను రక్షించగా, బాల కార్మికులను పనిలో పెట్టుకున్న వారిపై 22 కేసులు నమోదు చేశారు. పిల్లల చేతుల్లో పనిముట్లు కాకుండా పుస్తకాలు ఉండాలన్న లక్ష్యంతో జిల్లా పోలీసులు, సంబంధిత శాఖల అధికారులు సంయుక్తంగా ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. హోటళ్లు, దుకాణాలు, పరిశ్రమలు, వాణిజ్య సంస్థల్లో పనిచేస్తున్న చిన్నారులను గుర్తించి వారికి రక్షణ కల్పించారు.బాల కార్మికులను పనిలో పెట్టుకోవడం చట్టరీత్యా నేరమని పోలీసులు హెచ్చరించారు. అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. చిన్నారులను విద్యాభ్యాసం వైపు మళ్లించడం, వారి హక్కులను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రజలు కూడా సహకరించాలని, ఎక్కడైనా చిన్నారులతో పనులు చేయిస్తున్నట్లు గమనిస్తే వెంటనే పోలీసులకు లేదా సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. పిల్లల భవిష్యత్తు కోసం సమాజం అంతా కలిసి పనిచేయాలని మెదక్ పోలీసులు పిలుపునిచ్చారు.

# గులాబీ జెండా మోసేవారికి అండగా ఉంటా

- ఓటరు సవరణలో పార్టీ శ్రేణులు చురుగ్గా పాల్గొనాలి
- ప్రజా సమస్యలపై పోరాటం కొనసాగిద్దాం



**వరంగల్, జూలై 10 (మన విశ్వం ):** భారత రాష్ట్ర సమితి పార్టీ వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శ్రేణులు, బూత్ స్థాయి ప్రతినిధులకు ప్రత్యేక శిక్షణా కార్యక్రమాన్ని శుక్రవారం హనుమకొండలోని ఎస్వీ కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ, సభ్యత్వ నమోదు, సామాజిక మాధ్యమాల వినియోగంపై నాయకులు పార్టీ శ్రేణులకు మార్గనిర్దేశం చేశారు. మాజీ ప్రభుత్వ చీఫ్ విప్, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ కష్టకాలంలో పార్టీకి అండగా నిలిచిన వారిని ఎప్పటికీ మరువబోనని అన్నారు. గులాబీ జెండాను మోసే ప్రతి కార్యకర్తను గుండెల్లో పెట్టుకుంటానని చెప్పారు. కేసులు, బెదిరింపులు వచ్చినా ప్రజల తరఫున పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.
ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు, బూత్ స్థాయి ప్రతినిధులు మరింత చురుగ్గా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఓటర్లకు ఎన్యూమరేషన్ దరఖాస్తులు నింపడంలో సహాయం చేసేందుకు హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ప్రతి అర్హ ఓటరికి అవసరమైన సహాయం అందించాలని సూచించారు. మాజీ రెడ్కో చైర్మన్ వై. సతీష్ రెడ్డి మాట్లాడుతూ బూత్ స్థాయి ప్రతినిధులు ఎన్నికల అధికారులతో సమన్వయంగా పనిచేయాలని సూచించారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియపై ప్రజలకు అవగాహన కల్పించి దరఖాస్తుల పూర్తి విషయంలో సహకరించాలని అన్నారు. ఏవైనా సమస్యలు ఎదురైతే పార్టీ దృష్టికి తీసుకురావాలని సూచించారు.బీఆర్ఎస్ సామాజిక మాధ్యమాల రాష్ట్ర కన్వీనర్ మన్నె క్రిశాంక్ మాట్లాడుతూ సామాజిక మాధ్యమాలను ప్రజలకు మంచి విషయాలు చేరవేసే వేదికగా వినియోగించాలని అన్నారు. పార్టీ చేపడుతున్న కార్యక్రమాలు, ప్రజా సమస్యలపై జరుగుతున్న పోరాటాన్ని మరింత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ కార్యకర్తలకు సూచించారు. శిక్షణా కార్యక్రమం అనంతరం అతిథులను సన్మానించారు. ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో సమర్థంగా పనిచేస్తున్న పలువురు బూత్ స్థాయి ప్రతినిధులను అభినందించి సత్కరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, సామాజిక మాధ్యమాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


# మంత్రుల పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

- విద్యుత్ అంతరాయాలపై కఠిన హెచ్చరిక
- రవాణా సౌకర్యాల మెరుగుదలపై కలెక్టర్ ఆదేశాలు



**జోగులాంబ గద్వాల, జూలై 10 (మన విశ్వం ):** జిల్లాలో ఈనెల 13, 14 తేదీల్లో పర్యటించనున్న రాష్ట్ర మంత్రుల కార్యక్రమాలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క విద్యుత్ ఉపకేంద్రాల ప్రారంభోత్సవంలో, రహదారులు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి హామ్ రహదారుల శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొననున్న నేపథ్యంలో అన్ని ఏర్పాట్లు సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో విద్యుత్, రహదారులు--భవనాలు, ఆర్టీసీ శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. వేదికల ఏర్పాటు, అలంకరణ, భద్రత, ఇతర ఏర్పాట్లను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి ఎలాంటి లోపాలకు తావులేకుండా చూడాలని ఆదేశించారు.వర్షాకాలం, ఈదుర గాలుల నేపథ్యంలో జిల్లాలో ఎక్కడా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. అప్రకటిత విద్యుత్ కోతలు విధిస్తే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. జిల్లాలో రహదారి భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించి ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజల ప్రాణ భద్రతకు భంగం కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.మారుమూల గ్రామాలకు కూడా ప్రజా రవాణా సౌకర్యాలు మెరుగుపడేలా కొత్త బస్సు మార్గాలను రూపొందించాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. గట్టు నుంచి అలంపూర్ వరకు ప్రజల అవసరాలకు అనుగుణంగా బస్సులు నడిపేలా కార్యాచరణ సిద్ధం చేయాలని, గ్రామీణ ప్రాంతాల నుంచి చదువుల కోసం పట్టణాలకు వెళ్లే విద్యార్థులకు అనుకూల సమయాల్లో బస్సులు నడపాలని ఆదేశించారు. ఈ సమావేశంలో రహదారులు--భవనాల శాఖ కార్యనిర్వాహక ఇంజినీర్ ప్రగతి, విద్యుత్ శాఖ అధికారులు, గద్వాల డిపో అధికారులు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు. మంత్రుల పర్యటన విజయవంతం కావడంతో పాటు ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు.

# విద్యారంగ సమస్యలపై 'వామపక్షాల' సమరభేరి: మంత్రి క్వార్టర్ల ముట్టడికి యత్నం.. పోలీసులతో తోపులాట




**హైదరాబాద్, జూలై 10 (మన విశ్వం ):** రాష్ట్రంలో విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపిస్తూ ఏఐఎస్బీ, ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ, ఏఐఎఫ్‌డీఎస్, ఏఐపీఎస్‌యూ తదితర వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో గురువారం చేపట్టిన రాష్ట్ర వ్యాప్త విద్యాసంస్థల బంద్ విజయవంతమైంది. బంద్ పిలుపులో భాగంగా విద్యార్థి నేతలు హైదరాబాద్‌లోని మంత్రి క్వార్టర్ల ముట్టడికి యత్నించగా, అక్కడ భారీగా మోహరించిన పోలీసులకు, విద్యార్థులకు మధ్య తీవ్ర తోపులాట జరిగి ఉద్రిక్తత నెలకొంది. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల ముఖ్య నేతలు మాట్లాడుతూ.. విద్యా సంవత్సరం ప్రారంభమై నెలలు గడుస్తున్నా ప్రభుత్వ విద్యాసంస్థల్లో కనీస మౌలిక సదుపాయాలు కల్పించలేదని, నేటికీ పూర్తిస్థాయిలో పాఠ్యపుస్తకాలు, యూనిఫారాలు అందజేయకుండా విద్యాశాఖ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. గత కొన్ని ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న వేల కోట్ల రూపాయల ఫీజు రీఇంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ నిధులతో పాటు 'బెస్ట్ అవైలబిలిటీ స్కీమ్' బకాయి లను వెంటనే విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్పొరేట్ విద్యాసంస్థల నిలువు దోపిడీకి అడ్డుకట్ట వేసేందుకు తక్షణమే 'ఫీజు నియంత్రణ చట్టాన్ని' తీసుకురావాలని, ప్రభుత్వ పాఠశాలలను కుదించే ఆలోచనను విరమించుకోవాలని, సర్కారు జూనియర్, డిగ్రీ కళాశాలల్లోనూ మధ్యాహ్న భోజన పథకాన్ని వర్తింపజేయాలని కోరారు. విద్యాహక్కు చట్టం-2009ని పకడ్బందీగా అమలు చేస్తూనే, నూతన జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ-2020)కి వ్యతిరేకంగా అసెంబ్లీలో తీర్మానం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. సమస్యలను తక్షణమే పరిష్కరించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించిన విద్యార్థి నేతలను పోలీసులు బలవంతంగా అరెస్ట్ చేసి స్టేషన్లకు తరలించారు.

# మధిర రైతుల ఆశీస్సులే నా బలం



**- రైతు ఆశీర్వాద సభ విజయవంతం చేసిన ప్రజలకు భట్టి కృతజ్ఞతలు**
**- రైతు సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని వెల్లడి**

మధిర, జూలై 10 (మన విశ్వం): మధిర నియోజకవర్గంలో నిర్వహించిన రైతు ఆశీర్వాద సభను విజయవంతం చేసిన ప్రజలకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. తన సొంత నియోజకవర్గ ప్రజలు సభకు భారీగా తరలివచ్చి ఆశీర్వదించడం తనకు ఎంతో ఆనందాన్ని, ఆత్మవిశ్వాసాన్ని ఇచ్చిందని పేర్కొన్నారు. తన ఆహ్వానాన్ని మన్నించి సభకు విచ్చేసిన ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. చింతకాని వేదికగా రైతుల ఖాతాల్లో రైతు భరోసా నిధులను జమ చేయడం, కొత్త ఈ-పట్టాదార్ పాస్‌బుక్‌ల పంపిణీ ప్రారంభించడం చారిత్రాత్మక ఘట్టమని భట్టి విక్రమార్క అన్నారు. గతంలో పెట్టుబడి సాయం కోసం రైతులు నెలల తరబడి ఎదురుచూడాల్సి వచ్చేదని, ప్రస్తుతం ప్రజా ప్రభుత్వం కేవలం తొమ్మిది రోజుల్లోనే రూ.9 వేల కోట్ల రైతు భరోసా నిధులను రైతుల ఖాతాల్లో జమ చేసి తన చిత్తశుద్ధిని నిరూపించుకుందని పేర్కొన్నారు. వ్యవసాయానికి కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ పెద్దపీట వేసిందని ఆయన తెలిపారు. నాగార్జునసాగర్, శ్రీశైలం, జూరాల వంటి భారీ సాగునీటి ప్రాజెక్టులతో రైతులకు నీటి వసతి కల్పించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని చెప్పారు. ప్రస్తుతం రైతు రుణమాఫీ, ఉచిత విద్యుత్, పంట నష్ట పరిహారం, రైతు భరోసా వంటి పథకాల ద్వారా రైతును ఆర్థికంగా బలోపేతం చేస్తున్నామని వివరించారు. మహిళల సంక్షేమానికి కూడా ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని భట్టి విక్రమార్క అన్నారు. ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం, వడ్డీ లేని రుణాలు, మహిళల ఆర్థిక సాధికారత కోసం అమలు చేస్తున్న పథకాలు వారి జీవితాల్లో మార్పు తీసుకొస్తున్నాయని తెలిపారు. సమాజంలోని అన్ని వర్గాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. మౌలిక సదుపాయాల విస్తరణ, వ్యవసాయాభివృద్ధి, పారిశ్రామిక ప్రగతి, పారదర్శక పాలన ద్వారా 2047 నాటికి తెలంగాణను మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ ధ్యేయమని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. మధిర ప్రజల ప్రేమ, ఆశీర్వాదాలే తనకు బలమని, ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేందుకు చివరి శ్వాస వరకు రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తానని తెలిపారు.

# తడి చెత్తకు కొత్త పరిష్కారం

**- ఏరోబిన్ ద్వారా ఎరువు తయారీ**
**- 80 యూనిట్ల ఏర్పాటుకు ప్రణాళిక**
**- పరిశుభ్ర నగరమే లక్ష్యం**



మల్కాజిగిరి, జూలై 10 (మన విశ్వం ): మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ తడి చెత్త నిర్వహణలో మరో ముందడుగు వేసింది. మై ఈ విల్లాస్‌లో ఏర్పాటు చేసిన ఏరోబిన్ విధానం ద్వారా తొలి విడత సేంద్రియ ఎరువును విజయవంతంగా సేకరించింది. తడి చెత్తను దుర్వాసన లేకుండా శాస్త్రీయ పద్ధతిలో సేంద్రియ ఎరువుగా మార్చే ఈ ప్రయోగం విజయవంతమైనట్లు అధికారులు తెలిపారు. ఈ విజయాన్ని ఆధారంగా చేసుకుని కార్పొరేషన్ పరిధిలో మరో 80 ఏరోబిన్ యూనిట్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. నివాస సముదాయాలు, ఒక విద్యాసంస్థతో పాటు పర్వతాపూర్‌లోని సమీకృత ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రం సహా 15 కీలక ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేయనున్నారు. ఇళ్ల వద్దే తడి, పొడి చెత్తను వేర్వేరుగా వర్గీకరించే విధానాన్ని మరింత విస్తరించడంపై కార్పొరేషన్ దృష్టి సారించింది. తడి చెత్తను స్థానికంగానే శుద్ధి చేసి సేంద్రియ ఎరువుగా మార్చడం ద్వారా చెత్త రవాణా భారాన్ని తగ్గించడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు తోడ్పాటు అందించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు. ఏరోబిన్ విధానం ద్వారా తడి చెత్త నుంచి ఉపయోగకరమైన సేంద్రియ ఎరువు తయారవుతుందని, దుర్వాసన, కాలుష్యం లేకుండా వ్యర్థాల నిర్వహణ సాధ్యమవుతుందని అధికారులు తెలిపారు. దీంతో పరిశుభ్రమైన, పచ్చదనంతో కూడిన నివాస ప్రాంతాల అభివృద్ధికి దోహదం అవుతుందని పేర్కొన్నారు. ప్రజలు ఇంటి వద్దే చెత్తను వర్గీకరించి మున్సిపల్ యంత్రాంగానికి సహకరించాలని కార్పొరేషన్ విజ్ఞప్తి చేసింది. వ్యర్థాల వికేంద్రీకృత నిర్వహణ ద్వారా ప్రతి కాలనీని చెత్త రహిత ప్రాంతంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని వెల్లడించింది. పరిశుభ్రమైన, పచ్చదనంతో కూడిన మల్కాజిగిరి నిర్మాణానికి ఈ కార్యక్రమం కీలకంగా మారుతుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో మరిన్ని ప్రాంతాలకు ఈ విధానాన్ని విస్తరించి సుస్థిర వ్యర్థాల నిర్వహణను ప్రోత్సహించనున్నట్లు తెలిపారు.

# ఈవీఎంల గోదాం తనిఖీ

**- భద్రతపై సమీక్ష సీసీ కెమెరాల పరిశీలన అప్రమత్తంగా ఉండాలన్న కలెక్టర్**




జగిత్యాల, జూలై 10 (మన విశ్వం ): రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బి. సత్యప్రసాద్ దరూర్ క్యాంప్‌లోని ఈవీఎంల గోదామును సాధారణ తనిఖీలో భాగంగా పరిశీలించారు. గోదాములో అమలులో ఉన్న భద్రతా ఏర్పాట్లను స్వయంగా పరిశీలిస్తూ అధికారులకు పలు సూచనలు చేశారు. గోదాములో భద్రపరిచిన ఈవీఎంల భద్రత, సీసీ కెమెరాల పనితీరు, ఇతర సాంకేతిక అంశాలను కలెక్టర్ సమగ్రంగా పరిశీలించారు. ఎన్నికల సామగ్రి భద్రత విషయంలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు. ప్రతి నెలా ఈవీఎంల గోదామును నిబంధనల ప్రకారం తనిఖీ చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. భద్రతా ప్రమాణాలను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ అవసరమైన చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. గోదాము వద్ద పటిష్ట భద్రతా ఏర్పాట్లు కొనసాగించాలని, విధుల్లో ఉన్న సిబ్బంది ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈవీఎంల భద్రత ఎన్నికల ప్రక్రియలో అత్యంత కీలకమైన అంశమని కలెక్టర్ పేర్కొన్నారు. గోదాములోని అన్ని సదుపాయాలు సక్రమంగా పనిచేసేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ తనిఖీలో జగిత్యాల ఆర్డీవో మధు సూదన్, జగిత్యాల పట్టణ తహసీల్దార్ రామ్మోహన్ తదితర అధికారులు పాల్గొన్నారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించిన అన్ని భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని కలెక్టర్ సూచించారు.

# పేదల ఇళ్లను కూల్చం: హైడ్రా

**- ఎంఎస్, బీఎస్ మక్తా వాసులకు కమిషనర్ భరోసా**
**- దుష్ప్రచారాలను నమ్మొద్దని ప్రజలకు విజ్ఞప్తి**



హైదరాబాద్, జూలై 10 (మన విశ్వం ): హుస్సేన్‌సాగర్ సమీపంలోని ఎంఎస్ మక్తా, బీఎస్ మక్తా ప్రాంతాల్లో నివసిస్తున్న పేద కుటుంబాల ఇళ్లను హైడ్రా కూల్చివేయదని హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్ స్పష్టం చేశారు. పేదల ఇళ్లను తొలగించడం ప్రభుత్వ విధానం కాదని, ప్రజలు ఎలాంటి ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదని ఆయన భరోసా ఇచ్చారు. హుస్సేన్‌సాగర్ పూర్తి ట్యాంక్ స్థాయి (ఎఫ్‌టీఎల్) పరిధిలోని ఇళ్లకు హైడ్రా నోటీసులు జారీ చేసిందంటూ జరుగుతున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని పేర్కొన్నారు.
శుక్రవారం ఆయా ప్రాంతాల్లో పర్యటించిన కమిషనర్ స్థానిక ప్రజలతో నేరుగా సమావేశమై వారి సందేహాలకు సమాధానాలు ఇచ్చారు. హైడ్రా ఏర్పాటుకు ముందే నిర్మించబడిన పేదల నివాసాల విషయంలో ప్రభుత్వం ఎలాంటి కఠిన చర్యలు తీసుకోదని స్పష్టం చేశారు. కొందరు స్వార్థ ప్రయోజనాల కోసం తప్పుడు ప్రచారం చేస్తూ అమాయక ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని, అలాంటి ప్రచారాలను నమ్మవద్దని సూచించారు. హుస్సేన్‌సాగర్ ఎఫ్‌టీఎల్ పరిధిలోని ఇళ్లకు నోటీసులు ఇచ్చినట్లు తప్పుడు ప్రచారం చేయడమే కాకుండా, ప్రజలను రెచ్చగొట్టి నిరసనలకు ప్రేరేపించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు. వాస్తవ పరిస్థితిని ప్రజలకు వివరించేందుకే తాను స్వయంగా వచ్చానని, ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దని కోరారు. పేదల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్న కమిషనర్, గతంలో అంబర్‌పేట బతుకమ్మకుంట చెరువు పునరుద్ధరణ సమయంలో కూడా ఇప్పటికే నివసిస్తున్న పేదల ఇళ్లను మినహాయించి అభివృద్ధి పనులు చేపట్టిన విషయాన్ని గుర్తు చేశారు. అలాగే రామంతాపూర్ పెద్ద చెరువు పరిధిలో నివసిస్తున్న పేదలను ఖాళీ చేయించి వారికి డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల మంజూరుకు సిఫారసు చేసినట్లు వివరించారు. కమిషనర్ వివరణతో స్థానికులు ఊరట వ్యక్తం చేశారు. నేరుగా తమ వద్దకు వచ్చి ప్రభుత్వ వైఖరిని స్పష్టంగా తెలియజేయడం సంతోషకరమని చెప్పారు. తప్పుడు ప్రచారాలతో ప్రజల్లో అనవసర భయాందోళనలు సృష్టించే ప్రయత్నాలను నమ్మకుండా అధికారుల నుంచి వచ్చే అధికారిక సమాచారాన్నే విశ్వసించాలని
కమిషనర్ మరోసారి విజ్ఞప్తి చేశారు.

# అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు

**- వ్యర్థాల తొలగింపునకు ఆదేశాలు**
**- నిబంధనల అమలుపై దృష్టి**
**- రహదారులు పరిశుభ్రంగా ఉంచాలి**



మల్కాజిగిరి, జూలై 10 (మన విశ్వం ): మల్కాజిగిరి మున్సిపల్ కమిషనర్ బోడుప్పల్‌లోని మల్లికార్జున నగర్ ప్రాంతాన్ని సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్మాణాలు, రహదారుల పరిస్థితి, నిర్మాణ వ్యర్థాల నిర్వహణపై సమీక్ష నిర్వహించి అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. భవన నిర్మాణాల వల్ల ఏర్పడే నిర్మాణ, కూల్చివేత వ్యర్థాలను అనుమతి పొందిన సంస్థ ద్వారానే తొలగించాలని కమిషనర్ ఆదేశించారు. పట్టణ ప్రణాళిక, పారిశుద్ధ్య విభాగాల అధికారులు, సంబంధిత సంస్థ ప్రతినిధులు భవన యజమానులతో సమన్వయం చేసుకుని వ్యర్థాలను సకాలంలో తొలగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనుమతుల్లో పేర్కొన్న ఖాళీ స్థల నిబంధనలను ఉల్లంఘించి నిర్మాణాలు చేపట్టిన భవనాలపై కఠిన చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రణాళిక విభాగాన్ని ఆదేశించారు. అవసరమైతే నిబంధనల ప్రకారం భవనాలను స్వాధీనం చేసుకునే చర్యలు కూడా చేపట్టాలని స్పష్టం చేశారు. రహదారి నిర్మాణ పనులు పూర్తయిన వెంటనే మిగిలిన మట్టి, శిథిలాలు, ఇతర నిర్మాణ వ్యర్థాలను వెంటనే తొలగించాలని ఇంజినీరింగ్ విభాగానికి సూచించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా రహదారులను పరిశుభ్రంగా, అవరోధాలు లేకుండా ఉంచాలని ఆదేశించారు. నగర పరిశుభ్రత, ప్రజల భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ అన్ని విభాగాలు పరస్పర సమన్వయంతో పని చేయాలని కమిషనర్ సూచించారు. నిర్మాణ వ్యర్థాల నిర్వహణలో నిర్లక్ష్యం ప్రదర్శించిన వారిపై నిబంధనల ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ తనిఖీలో డిప్యూటీ కమిషనర్, కార్యనిర్వాహక ఇంజినీర్, ఉప కార్యనిర్వాహక ఇంజినీర్, సహాయ ఇంజినీర్‌తో పాటు సంబంధిత సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు. నగరంలో పరిశుభ్రత, ప్రణాళికాబద్ధమైన అభివృద్ధి కోసం తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని అధికారులు తెలిపారు.

# ఎస్ఐఆర్‌కు వేగం పెంచాలి

**- ఇంటింటి సర్వే పరిశీలన**
**- కలెక్టర్ కీలక ఆదేశాలు**
**- అర్హులందరికీ ఓటు హక్కు**



జోగులాంబ గద్వాల, జూలై 10 (మన విశ్వం ): ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని జిల్లాలో వేగవంతం చేసి, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆదేశించారు. గద్వాల పట్టణంలోని 30వ వార్డు రాతి బురుజు ప్రాంతం, పోలింగ్ కేంద్రం నంబర్ 260లో బూత్ స్థాయి అధికారులు నిర్వహిస్తున్న ఇంటింటి సర్వేను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఫారాల పంపిణీ, స్వీకరణ, వివరాల నమోదు పురోగతిని కలెక్టర్ సమీక్షించారు. ఫారాలు పంపిణీ చేయడంతో పాటు పూర్తిగా నింపిన దరఖాస్తులను తిరిగి సేకరించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. వివరాల నమోదు ప్రక్రియలో జాప్యం తగ్గించేందుకు అవసరమైన చోట అదనపు సిబ్బందిని వినియోగించాలని ఆదేశించారు. ప్రతి ఇంటిని తప్పనిసరిగా సందర్శించి అర్హులైన ఓటర్ల వివరాలు నమోదు చేయాలని సూచించారు. ఒక కుటుంబంలో ఒక సభ్యుడి నమోదు పూర్తయితే మిగిలిన అర్హులైన సభ్యులందరి వివరాలు కూడా నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఇంకా దరఖాస్తులు సమర్పించని కుటుంబాలను గుర్తించి ప్రత్యేకంగా అనుసరణ చేపట్టాలని ఆదేశించారు. మరణించిన వారు, ఇతర ప్రాంతాలకు శాశ్వతంగా వెళ్లిపోయిన ఓటర్ల వివరాలను ప్రత్యేకంగా నమోదు చేసి ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. బూత్ స్థాయి అధికారులు ఓటర్లతో మర్యాదగా వ్యవహరించాలని, మహిళలు, వృద్ధులు, దివ్యాంగులకు అవసరమైన సహాయం అందించాలని పేర్కొన్నారు.
ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులను భాగస్వాములను చేయాలని అధికారులకు సూచించారు. ప్రజల సహకారంతో కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయాలని తెలిపారు. ఈ పర్యటనలో గద్వాల తహసీల్దార్ హరికృష్ణ, ఉప తహసీల్దార్ వరప్రసాద్, ఎన్నికల విభాగం అధికారులు, రెవెన్యూ అధికారులు, బూత్ స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు. కలెక్టర్ సర్వే నిర్వహణ తీరును పరిశీలిస్తూ అవసరమైన సూచనలు చేశారు.

# వైద్య పరికరాల కొనుగోళ్లకు కొత్త విధానం

**- పారదర్శక డిజిటల్ వ్యవస్థకు మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశాలు**
**- ప్రభుత్వ ఆస్పత్రుల్లో నాణ్యమైన వైద్య పరికరాలే లక్ష్యం**



హైదరాబాద్, జూలై 10 (మన విశ్వం ): ప్రభుత్వ ఆస్పత్రుల్లో నాణ్యమైన వైద్య పరికరాలను వేగంగా, పారదర్శకంగా అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా వైద్య పరికరాల కొనుగోలు విధానంలో సమూల మార్పులు తీసుకురావాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. కొనుగోలు ప్రక్రియలో పారదర్శకత, జవాబుదారీతనం, సాంకేతికతకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తూ కొత్త విధానానికి సంబంధించిన సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని కోటిలో ఉన్న తెలంగాణ మెడికల్ సర్వీసెస్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీజీఎంఎస్ఐడీసీ) కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మంత్రి వైద్య పరికరాల కొనుగోలు, టెండర్ ప్రక్రియ, పరికరాల పనితీరు, నిర్వహణ, మరమ్మతులపై విస్తృతంగా సమీక్షించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఏర్పాటు చేసే ప్రతి పరికరం అత్యుత్తమ నాణ్యతతో ఉండటంతో పాటు నిర్ణీత గడువులోగా అందుబాటులోకి రావాలని స్పష్టం చేశారు. కొనుగోలు ప్రక్రియను పూర్తిగా డిజిటలైజ్ చేయాలని మంత్రి ఆదేశించారు. ఇండెంట్ నమోదు నుంచి టెండర్, కొనుగోలు, సరఫరా, ఆస్పత్రిలో ఏర్పాటు వరకు ప్రతి దశను ఆన్‌లైన్‌లో పర్యవేక్షించే ఎండ్-టు-ఎండ్ డిజిటల్ వ్యవస్థను త్వరితగతిన అమలు చేయాలని సూచించారు. దీనివల్ల కొనుగోలు ప్రక్రియలో పారదర్శకత పెరగడంతో పాటు జాప్యాలు, లోపాలను నివారించే అవకాశం ఉంటుందని తెలిపారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉన్న వైద్య పరికరాల పనితీరును నిరంతరం పర్యవేక్షించేందుకు కేంద్రీకృత డ్యాష్‌బోర్డ్‌ను ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు. ప్రతి పదిహేను రోజులకు ఒకసారి ఈ డ్యాష్‌బోర్డ్‌ను ఉన్నతాధికారులు సమీక్షించి, పనిచేయని పరికరాలను వెంటనే మరమ్మతు చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు నిరంతర వైద్య సేవలు అందించడంలో పరికరాల పనితీరు కీలకమని పేర్కొన్నారు. ప్రస్తుతం అమల్లో ఉన్న వార్షిక నిర్వహణ ఒప్పందాలను సమీక్షించి, సేవా ప్రమాణాలను పాటించని సంస్థలపై కఠిన చర్యలు తీసుకునేలా నిబంధనలు సవరించాలని మంత్రి ఆదేశించారు. నిర్వహణలో నిర్లక్ష్యం ప్రదర్శించే సంస్థలపై జరిమానాలు విధించే విధానాన్ని అమలు చేయాలని సూచించారు. వైద్య పరికరాల నిర్వహణలో రాజీకి తావులేదని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా వైద్య పరికరాల పనితీరును క్షేత్రస్థాయిలో పర్యవేక్షించేందుకు ఎనిమిది మంది బయోమెడికల్ ఇంజినీర్లను నియమించాలని మంత్రి ఆదేశించారు. హైదరాబాద్ ప్రాంతానికి నలుగురు, తూర్పు, పడమర, ఉత్తర, దక్షిణ జోన్లకు ఒక్కొక్కరిని నియమించి పర్యవేక్షణను మరింత బలోపేతం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో టీజీఎంఎస్ఐడీసీ మేనేజింగ్ డైరెక్టర్ గౌరవ్ ఉప్పల్, వైద్య విద్య డైరెక్టర్ నరేంద్ర కుమార్, ప్రజారోగ్య డైరెక్టర్ రవీంద్ర
నాయక్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# మెట్రో రైలు ప్రాజెక్టు-1లో వాటాపై కేంద్రం ఆసక్తి విలువ మళ్లీ మదింపు వెనక మతలబు ఇదే!



హైదరాబాద్: మెట్రో మొదటి ఫేజ్-1 ప్రాజెక్టులో వాటా తీసుకోవాలని కేంద్రం ఆసక్తి చూపిస్తోందా అందుకే ప్రాజెక్టు విలువను మరో సారి మదింపు చేయిస్తోందా అంటే అవుననే చెబుతున్నారు అధికారులు. కేంద్రప్రభుత్వంతో జరుగుతున్న ఉత్తర ప్రత్యుత్తరాలను పరిశీలిస్తే ఇదే అనిపిస్తోందని చెబుతున్నారు. హైదరాబాద్ మెట్రో ప్రాజెక్టులోని ఫేజ్-1, ఫేజ్-2లు వేర్వేరు యాజమాన్యాల కింద ఉంటే నిర్వహణ లో ఇబ్బందులు వస్తాయని అభ్యంతరం చెబుతోందని, ఒకే యాజమాన్యంలో ఉంటే మేలని సూచిస్తోందని సమాచారం. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం వివరాలిలా. అప్పుడు చూద్దామన్న రాష్ట్రం : మెట్రోరైలు ఫేజ్-1లోని ఎల్అండ్టీ వాటాను 100% కొనుగోలు చేశాక తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దానికి పూర్తిస్థాయి యాజమాని అవుతుంది. విస్తరణలో భాగంగా చేపట్టనున్న ఫేజ్-2ను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్త ప్రాజెక్టుగా ప్రతిపాదించారు. నిర్మాణం పూర్తయిన తర్వాత నిర్వహణ సమయంలో సమన్వయ సమస్యలు ఎదురైతే ఎలా పరిష్కరిస్తారంటూ కేంద్ర ప్రభుత్వం గతంలో అడిగింది. ఫేజ్-2 పూర్తయిన మూడేళ్ల తర్వాత అప్పటి పరిస్థితులకు అనుగుణంగా ఒక అవగాహనకు రావొచ్చని రాష్ట్రం సమాధానమిచ్చింది. కేంద్రం మాత్రం రెండు దశల ప్రాజెక్టులూ ఒకే యాజమాన్యం కింద ఉండాలని భావిస్తున్నట్లు సమాచారం. దేశంలోని అన్ని మెట్రో రైళ్లు ఈ విధానంలో నడుస్తున్నాయని గుర్తుచేస్తోంది. అందుకే ఫేజ్?-1లో భాగస్వామి కావాలని ఆసక్తి చూపిస్తోందని సమాచారం. అదే జరిగినట్లయితే మెట్రోకి హైదరాబాద్లో ఉన్న 269 ఎకరాల భూములు, మాల్స్, ఇతరత్రాలన్నీ ఉమ్మడి ఆస్తులుగా మారతాయి. కేంద్రం వాటాదారుగా చేరినట్లయితే ఇదివరకు ఐఆర్ఎఫ్సీ ఇస్తానని చెప్పిన 3.5 నుంచి 4 శాతాని కంటే తక్కువ వడ్డీకే రుణాలు వచ్చే అవకాశం ఉంటుంది. మెట్రో ఫేజ్-1 నిర్వహణలో నష్టాలు రావడానికి ఏటా చెల్లిస్తున్న రూ.940 కోట్ల వడ్డీ ఒక కారణం. తక్కువ వడ్డీకి లోన్లు తెస్తే ఈ భారం తగ్గుతుంది. గతంలో ఎల్అండ్టీ మెట్రో రైలు(హైదరాబాద్) లిమిటెడ్కు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రూ.900 కోట్ల వడ్డీలేని లోన్సాఫ్ట్లోన్ ఇచ్చింది. మదింపులో ఈ మొత్తాన్ని మినహాయించేందుకు తెలంగాణ కేబినెట్ ఆమోదించింది. ఇది కూడా మెట్రో ఫేజ్-1 విలువను తిరిగి మదింపు చేసేందుకు ఒక కారణమని సమాచారం. సంయుక్త ప్రాజెక్టు ల్లో వాటాలు ఇలా : మెట్రో రైలు చట్టంలో ఇటీవల చేసిన మార్పుల ప్రకారం ఉమ్మడి ప్రాజెక్టుల్లో కేంద్ర ప్రభుత్వం వాటా 20%, రాష్ట్రం వాటా 20%, లోన్ల ద్వారా 60% నిధులను సమకూర్చుకోవాల్సి ఉంటుం ది. కేంద్రం వాటా 20% అని చెబుతున్నప్పటికీ భూసేకరణ, నిర్మాణ సమయంలో వడ్డీల ఖర్చును తెలంగాణ రాష్ట్రమే భరించాల్సి ఉంటుంది. అప్పుడు కేంద్రం వాటా 18 శాతమే ఉంటుందని సమాచారం. ఫేజ్-1లో కేంద్రం వాటాను తీసుకున్నట్లయితే మెట్రో తొలి రెండు దశలూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ప్రాజెక్టులు అవుతాయి. అప్పుడు బోర్డులో కేంద్రం, రాష్ట్రం తరఫున అధికారులు డైరెక్టర్లుగా ఉంటారు. సమన్వయంతో ప్రాజెక్ట్ పరుగులు పెడుతుందని కేంద్రం ప్రభుత్వం యోచిస్తోంది. సీఎం లేఖలు రాసినా స్పందన కరవు : మెట్రో రైలు ప్రాజెక్టుపై నిర్ణయాల అమలులో వేగం పెంచాలంటూ సీఎం రేవంత్రెడ్డి ఇటీవల కేంద్ర మంత్రులకు మరోమారు లేఖలు రాశారు. ఇప్పటివరకు కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ నుంచి స్పందన లేదు. విలువను తిరిగి లెక్కించేందుకు గురువారం వరకు ఎస్బీఐ క్యాప్స్ ఇంకా ఏర్పాటు కాలేదు. సమన్వయానికి కేంద్ర ప్రభుత్వం తరఫున అధికారిని సైతం నియమించలేదు. మూసీ ప్రాజెక్టుకు రూ.7,345 కోట్లు : ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న మూసీ నది అభివృద్ధి ప్రాజెక్టులో మరో కీలక ముందడుగు పడింది. భూసేకరణ వ్యయం కాకుండా 6% నిర్వహణ ఖర్చులతో ఫేజ్?-1 మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టుకు రూ.7,345.12 కోట్లు వెచ్చించేందుకు అంగీకరిస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులను జారీ చేసింది. పరిపాలనా అనుమతి మంజూర వడంతో ప్రాజెక్టుకు సాంకేతిక అనుమతులు తీసుకుని వెంటనే టెండర్ల ప్రక్రియ ప్రారంభిస్తామని ఎంఆర్డీసీఎల్ (మూసీ నది పరీవాహక ప్రాంత అభివృద్ధి సంస్థ) వివరించింది.

# హైదరాబాద్లో డ్రగ్స్ కలకలం.. ఐదుగురు ముఠా సభ్యుల అరెస్ట్



హైదరాబాద్, జులై 10: హైదరాబాద్ అత్తాపూర్లో ఎస్వోటీ, స్థానిక పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించి డ్రగ్స్ విక్రయిస్తున్న ఐదుగురు నిందితులను అరెస్ట్ చేశారు. మహానగరంలో డ్రగ్స్ రవాణా, విక్రయాలపై పోలీసులు ఉక్కుపాదం మోపుతు న్నారు. ఇందులో భాగంగా రాజేంద్రనగర్ ఎస్వోటీ బృందం, అత్తాపూర్ పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన మెరుపు దాడుల్లో ఒక ప్రమాదకర డ్రగ్స్ ముఠా గుట్టురట్టయింది. అత్తాపూర్ పరిధిలో యథేచ్ఛగా మాదక ద్రవ్యాలను విక్రయిస్తున్న ఐదుగురు నిందితుల ను పోలీసులు అదుపులోకి తీసుకోగా, మరో ఇద్దరు నిందితులు పోలీసుల నుంచి తప్పించు కుని పరారయ్యారు. పట్టుబడిన నిందితుల నుంచి భారీ మొత్తంలో ఎండీఎంఏ (మీణమీూ) డ్రగ్స్, నిషిద్ధ ఇంజెక్షన్లు, టాబ్లెట్లతో పాటు ఒక కత్తి, ఐదు మొబైల్ ఫోన్లు, రూ. 16,930 నగదును పోలీసులు సీజ్ చేశారు. పోలీసుల ప్రాథమిక విచారణలో ఈ ముఠా డ్రగ్స్ సరఫరాకు సంబంధించిన కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. నిందితులు నగరంలోని దారుల్షిఫా ప్రాంతం నుంచి తక్కువ ధరకే ఈ డ్రగ్స్ను కొనుగోలు చేసి, వాటిని అత్తాపూర్కు తరలించి ఎక్కువ ధరకు విక్రయిస్తున్నట్లు తేలింది. ఈ దందాలో వినియోగదారులకు డ్రగ్స్ చేరవేయడానికి సయ్యద్ అబుల్ హసన్ (ూ2) అనే ఆటో డ్రైవర్ను కీలక వనరుగా వాడుకున్నారు. అరెస్టయిన వారిలో సయ్యద్ అబుల్ హసన్తో పాటు సైఫ్ అలీ మీర్జా, అహ్మద్ హుస్సేన్, షేక్ అయూబ్, మీర్ షబ్బీర్ అలీ ఉన్నారు. ఈ ముఠాలో కీలకమైన ప్రధాన నిందితుడు (ూ1) బాకర్, ముజాహిద్ అనే ఇద్దరు వ్యక్తులు ప్రస్తుతం పరారీలో ఉన్నారు. వీరి కోసం పోలీసులు ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. కాగా, ఈ కేసులో కీలకంగా ఉన్న హసన్పై గతంలోనే పలు పోలీస్ స్టేషన్లలో చోరీలు, దోపిడీలు, ఎన్డీపీఎస్ (చీఖూూ) చట్టం కింద అనేక క్రిమినల్ కేసులు నమోదై ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. పాత నేరస్థులతో ముడిపడి ఉన్న ఈ డ్రగ్స్ నెట్వర్క్పై అత్తాపూర్ పోలీసులు కేసు నమోదు చేసి, దీని వెనుక ఇంకా ఎవరెవరి ం ఉందనే కోణంలో దర్యాప్తు జరుపుతున్నారు.

# : హైదరాబాద్లో ఉద్రిక్తత.. మినిస్టర్స్ కాలనీ వద్ద విద్యార్థి సంఘాల ఆందోళన



హైదరాబాద్, జులై 10:
నగరం లోని మినిస్టర్స్ కాలనీ సమీపంలో శుక్రవారం ఉద్రిక్త పరిస్థి తులు నెలకొన్నాయి. విద్యారంగ సమస్యల ను వెంటనే పరిష్కరించాలని డిమా ండ్ చేస్తూ వివిధ విద్యార్థి సంఘాల నాయకులు, కార్యకర్త లు మినిస్టర్స్ క్వార్టర్స్ను ముట్టడించేందుకు యత్నించారు. తమ సమస్యలు పరిష్కారమయ్యే వరకు ఉద్యమాలు కొనసాగిస్తామని హెచ్చరించారు. ముందస్తు సమాచారం మేరకు భారీగా పోలీసులు అక్కడ మోహరించి వారిని అడ్డుకున్నారు. ఈ క్రమంలో విద్యార్థులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఆందోళన కొనసాగించారు. మినిస్టర్స్ క్వార్టర్స్ వైపు దూసుకెళ్లేందుకు యత్నించిన విద్యార్థి సంఘాల కార్యకర్తలను పోలీసులు అడ్డుకో వడంతో ఇరువర్గాల మధ్య తోపులాట చోటుచే సుకుంది. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో అదనపు పోలీసు బలగాలను రంగంలోకి దించి పలువురు విద్యార్థి నాయకులను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారిని పోలీస్ స్టేషన్లకు తరలించగా, మినిస్టర్స్ కాలనీ పరిసర ప్రాంతాల్లో పోలీసులు భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. ప్రస్తుతం పరిస్థితి అదుపులోనే ఉన్నప్పటికీ, విద్యార్థి సంఘాల తదుపరి కార్యాచరణపై పోలీసులు అప్రమత్తంగా ఉన్నారు.

# 80 వేల మైనారిటీ విద్యార్థులకు కృత్రిమ మేధస్సు శిక్షణ

**- ఉచిత ఏఐ--డిజిటల్ భద్రత కార్యక్రమానికి శ్రీకారం**

**- భవిష్యత్ ఉద్యోగాలకు విద్యార్థులను సిద్ధం చేయడమే లక్ష్యం**



హైదరాబాద్, జూలై 10 (మన విశ్వం ): తెలంగాణలోని మైనారిటీ విద్యార్థులను భవిష్యత్ సాంకేతిక ప్రపంచానికి సిద్ధం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. మైనారిటీస్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ (టీఎంఆర్ఈఐఎస్) పరిధిలోని 205 పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న సుమారు 80 వేల మంది విద్యార్థులకు కృత్రిమ మేధస్సు (ఏఐ) అవగాహన, డిజిటల్ భద్రత శిక్షణ అందించే భారీ కార్యక్రమాన్ని ప్రకటించింది. ఈ కార్యక్రమాన్ని మైనారిటీల సంక్షేమ శాఖ మంత్రి మహ్మద్ అజహరుద్దీన్ ప్రారంభించారు. టీఎంఆర్ఈఐఎస్, మాస్క్ నెక్స్ట్‌జెన్, డాక్సా కన్సల్టింగ్ ప్రైవేట్ లిమిటెడ్ భాగస్వామ్యంతో ఈ కార్యక్రమం అమలు కానుంది. ఆగస్టు 15 నుంచి ప్రారంభమయ్యే ఈ శిక్షణను పూర్తిగా ఉచితంగా అందించనున్నారు. ప్రభుత్వం లేదా విద్యార్థులపై ఎలాంటి ఆర్థిక భారం లేకుండా సామాజిక బాధ్యతతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ సందర్భంగా మంత్రి మహ్మద్ అజహరుద్దీన్ మాట్లాడుతూ, ప్రపంచవ్యాప్తంగా కృత్రిమ మేధస్సు వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో మైనారిటీ విద్యార్థులు వెనుకబడకుండా ఉండేందుకు ఈ కార్యక్రమాన్ని రూపొందించినట్లు తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానం, డిజిటల్ అవగాహన, విమర్శనాత్మక ఆలోచన, నాయకత్వ లక్షణాలు వంటి అంశాల్లో విద్యార్థులను తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు. ఏఐ రంగంలో తెలంగాణ విద్యార్థులు నాయకులుగా ఎదగాలని ప్రభుత్వం కోరుకుంటోందని చెప్పారు. మహిళా సాధికారతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి పేర్కొన్నారు. ముఖ్యంగా మైనారిటీ బాలికలు అత్యాధునిక సాంకేతిక విద్యను అభ్యసించి ఉద్యోగ, వ్యాపార రంగాల్లో రాణించేలా ప్రత్యేక అవకాశాలు కల్పిస్తున్నామని వివరించారు. విద్య, సాంకేతిక నైపుణ్యాలు, ఆత్మవిశ్వాసం కలిగిన యువతే రాష్ట్ర భవిష్యత్తుకు బలమని ఆయన అన్నారు. గేమిఫైడ్ స్వీయ-అభ్యాస డిజిటల్ వేదిక ద్వారా ఈ శిక్షణ అందించనున్నారు. ఇందులో కృత్రిమ మేధస్సు, డిజిటల్ భద్రత, ఇంగ్లీష్ కమ్యూనికేషన్, నాయకత్వ నైపుణ్యాలు, విమర్శనాత్మక ఆలోచన, ఆవిష్కరణలపై ఇంటరాక్టివ్ పాఠాలు ఉంటాయి. దేశంలో మైనారిటీ విద్యార్థుల కోసం చేపడుతున్న అతిపెద్ద ఏఐ విద్యా కార్యక్రమాల్లో ఇది ఒకటిగా నిలవనుండగా, తెలంగాణను సాంకేతికత, ఆవిష్కరణలు, సమగ్ర అభివృద్ధికి ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దే ప్రయత్నాలకు ఇది మరింత బలం చేకూరుస్తుందని అధికారులు పేర్కొన్నారు.

# కాంగ్రెస్ నేతలకు కంటి పరీక్షలు చేయించాలి




హైదరాబాద్: తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని, ఎంఐఎం పార్టీని లక్ష్యంగా చేసుకుని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఘాటు విమర్శలు చేశారు. ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీకి చెందిన ఫాతిమా మహిళా కళాశాల.. సకలం చెరువు పరిధిలో ఉందని బండి సంజయ్ మరోసారి ఆరోపించారు. ఇది ప్రపంచమంతా చూస్తున్నా కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం చూడనట్లు నటిస్తోందని ఆయన మండిపడ్డారు. పేదల ఇళ్లను హైడ్రా పేరుతో కూల్చివేస్తున్న ప్రభుత్వం.. అందరికీ కనిపిస్తున్న ఈ ఆక్రమణను మాత్రం ఎందుకు గుర్తించలేకపోతోందని ప్రశ్నించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా బండి సంజయ్ పోస్టు పెట్టారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులకు వెంటనే కంటి పరీక్షలు చేయించాల్సిన అవసరం ఉందంటూ బండి సంజయ్ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. కాంగ్రెస్ నేతల కోసం రాష్ట్రవ్యాప్తంగా బీజేపీ కార్యకర్తలు ఉచిత కంటి పరీక్షా శిబిరాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఆ పరీక్షల తర్వాత కూడా వారికి చెరువు పక్కన కళాశాల కనిపించకపోతే సమస్య కళ్లలో కాదు.. వారి రాజకీయాల్లోనే ఉందని అర్థం చేసుకోవాలన్నారు. మరోవైపు హైడ్రా పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం ఆటలాడుతోందన్నారు. కాంగ్రెస్ ఎక్కడ రాజకీయ రంగోలి వేయాలనుకుంటే అక్కడ ఫుల్ ట్యాంక్ లెవల్ ) గీతలు వారి మిత్రులకు అనుకూలంగా మారిపోతున్నాయంటూ తీవ్ర విమర్శలు గుప్పించారు. అధికార పార్టీ తనకు అనుకూలంగా వ్యవస్థలను వినియోగిస్తోందని కేంద్ర మంత్రి ఆరోపించారు. కాగా, సకలం చెరువు ఎఫ్టీఎల్ పరిధిలో ఓవైసీ కాలేజీ ఉందనే అంశంపై ఇటీవల రాజకీయంగా చర్చ జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా ఎక్స్ వేదికగా బండి సంజయ్ చేసిన పోస్టు.. తెలంగాణ రాజకీయాల్లో మరోసారి దుమారం రేపే అవకాశాలు కనిపిస్తున్నాయి.


# ప్రజా భవన్లో ఏఐసీసీ సెక్రటరీ సచిన్ సావంత్‌ను కలిసిన కొండా సురేఖ





హైదరాబాద్ :
స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి వ్యవహార శైలిపై మంత్రి కొండా సురేఖ ప్రజా భవన్లో ఏఐసీసీ సెక్రటరీ సచిన్ సావంత్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. అలాగే సాయంత్రం సచిన్ సావంత్‌ను కడియం శ్రీహరి సైతం కలువనున్నారు. కాగా, మంత్రి సురేఖకు తెలియకుండానే కడియం శ్రీహరి స్టేషన్‌ఘన్‌పూర్ పరిధిలోని ఆలయాల పరిస్థి తులపై హైదరాబాద్లో దేవాదాయ శాఖ కమిషనర్‌తో ఎండోమెంట్ రివ్యూ నిర్వహించిన విషయం తెలిసిందే. దేవాదాయ శాఖ మంత్రినైన తనకే తెలియకుండా కడియం శ్రీహరి రివ్యూ చేయడంపై మంత్రి కొండా సురేఖ తీవ్ర తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. కడియంపై స్టేట్ కమాండ్‌కి కాకుండా నేరుగా ఏఐసీసీకి ఫిర్యాదు చేశారు. దీంతో రంగంలోకి దిగిన సచిన్ సావంత్ ఇరువురితో మాట్లాడనున్నారు.

# ప్రజల ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు



వీణవంక, జూలై 10 : ప్రజల ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు ఉంటాయని హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అన్నారు. వీణవంక మండలంలోని చల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సరైన సౌకర్యాలు లేవని, సిబ్బంది లేరని ఎమ్మెల్యేకు పలువురు ఫిర్యాదులు చేశారు. దీంతో కౌశిక్ రెడ్డి స్థానిక నాయకులతో కలసి పీహెచ్‌సీని శుక్రవారం తనిఖీ చేశారు. ఆసుపత్రిలో ఓపీ రిజిస్టర్, మెడికల్ షాపు, ల్యాబ్ తదితర విభాగాలను పరిశీలించి, డాక్టర్ సంతోష్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ పీహెచ్‌సీలో అరకొర సిబ్బందితో పూర్తి స్థాయిలో వైద్యం అందక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. మండలంలోని చల్లూరు గ్రామస్తులు పీహెచ్సీలో ప్రజలకు సరైన వైద్యం అందడంలేదని ఫిర్యాదు చేశారని తెలిపారు. ఆసుపత్రికి మొత్తం 12 మంది సిబ్బంది మంజూరై ఉన్నప్పటికీ వారిలో ఆరుగురు డిప్యుటేషన్‌పై ఆయా ఆసుపత్రుల్లో విధులు నిర్వహిస్తున్నారని, చల్లూరులో మాత్రం ఒక్క వైద్యాధికారి, అరకొర సిబ్బందితో ఆసుపత్రి నిర్వహణ జరుగుతుండటంతో ప్రజలకు పూర్తి స్థాయిలో వైద్య సేవలు అందడం లేదని ఆవేదన వ్యక్తిం చేశారు. చల్లూరు పీహెచ్సీ ప్రజలకు ఉత్తమ వైద్య సేవలు అందించి, ప్రసవాలలో విశేష ప్రతిభ కనబరిచి మూడు సార్లు అవార్డసాధించిందని గుర్తు చేశారు.

# చెరువులను మినీ ట్యాంక్‌బండ్‌లు చేస్తామన్నారు ఐదేళ్లుగా పనులు సా....గదీస్తున్నారు



వరంగల్: రాష్ట్రంలోని ప్రధాన నగర చెరువులను మినీ ట్యాంక్ బండ్‌లుగా అభివృద్ధి చేసి, అందాలను మరింత ద్విగుణీకృతం చేయడంతో పాటు ప్రజలకు ఆహ్లాదం పంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఆయా తటాకాలకు సంబంధించిన పనులకు ముందడుగు పడినా, సకాలంలో పూర్తి కావడం లేదు. ఏళ్ల తరబడి నత్తనడకన పనులు సాగుతుండటం, కేటాయించిన నిధులూ వెనక్కి వెళ్లడంతో త్రినగరి వరంగల్‌లో మినీ ట్యాంక్ బండ్‌ల పరిస్థితి అధ్వాన్నంగా మారింది. రూ.కోట్లు ఖర్చు చేసి చేపట్టిన పనులేవీ కొలిక్కి రాకపోవడంతో ప్రజలకు ఆహ్లాదం అందని ద్రాక్షగానే మారింది. ఇంకోవైపు రూ.కోట్లు వెచ్చించి ఏర్పాటు చేసిన కొన్ని పరికరాలూ వినియోగంలోకి రాకపోవడంతో అటకెక్కుతున్నాయి సుందరీకరణ చేయాల్సిన చెరువులు : వరంగల్, హనుమకొండ, ఖాజీ పేట వాసులకు ఆహ్లాదం పంచేందుకు నగరం లోని పలు చెరువులను మినీ ట్యాంక్ బండ్ లుగా, పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దేందుకు దాదాపు ఐదేళ్ల క్రితమే పనులు ప్రారంభ మయ్యాయి. అయితే బల్దియా యంత్రాంగం పట్టింపులు లేకపోవడం వల్లో లేక నగరవాసుల దురదృష్టమో కానీ ఇప్పటికీ ఒక్క మినీ ట్యాంక్ బండ్ కూడా పూర్తిస్థాయిలో ప్రజలకు అందుబాటులోకి రాలేదు. నగరంలోని భద్రకాళి చెరువు, వడ్డేపల్లి చెరువు, వడ్డేపల్లి చిన్న చెరువు, ఉర్సురంగ సముద్రం, పద్మాక్షి ఆలయ చెరువుల్లో నాలుగింటిని మినీ ట్యాంక్ బండ్‌జాబితాలో చేర్చారు. అన్ని పనులూ అరకొరగానే : చెరువుల అభివృద్ధి పనులకు కొన్నింటికి స్మార్ట్ సిటీ పథకం, అమృత్ పథకం, రాష్ట్ర ప్రభుత్వ నిధులు కలిపి కేటాయించి పనులకు అంకురార్పణ చేశారు. పద్మాక్షి ఆలయ తటాకానికి ప్రత్యేక నిధులు కేటాయించి బతుకమ్మ ఘాట్?గా సుందరీకరించే పనులకు శ్రీకారం చుట్టారు. దాదాపు అన్ని మినీ ట్యాంక్ బండ్ పనులు ఒకటి రెండు సంవత్సరాల వ్యవధిలో చేపట్టారు. మూడేళ్ల నుంచి ఐదేళ్ల వరకు సమయం అవుతున్నా, ఒక్కటీ పూర్తి కాలేదు. దీంతో ప్రజలకు ఒక్క మినీ ట్యాంక్ బండ్ కూడా అందుబాటులోకి రాలేదు. రూ.కోట్ల పరికరాలు నిరుపయోగం : భద్రకాళి చెరువుపై మినీ ట్యాంక్ బండ్ నిర్మాణం కోసం ప్రభుత్వం మొత్తం రూ.62 కోట్లు కేటాయించింది. 2018లోనే ఈ పనులు ప్రారంభించగా, రెండేళ్ల వరకు కొంతమేర పూర్తయ్యాయి. చెరువు కట్ట బలోపేతంతో పాటు సుందరీకరణ పనులు చేపట్టారు. పిల్లలకు పార్కు, ఆట వస్తువులు, ఓపెన్? జిమ్ వంటి పరికరాలు ఏర్పాటు చేశారు. కానీ ప్రధానమైన బండ్ నిర్మాణం, సుందరీకరణ పూర్తి కాకపోవడంతో ప్రజలు అటువైపు రావడం లేదు. ఫలితంగా రూ.లక్షలు వెచ్చించి అమర్చిన పరికరాలు ఎందుకూ పనికి రాకుండా శిథిలావస్థకు చేరుతున్నాయి.



# టీమిండియాపై బీసీసీఐ సీరియస్..

ఇంగ్లండ్ పర్యటనలో వరుసగా మూడు టీ20 మ్యాచ్‌ల్లో ఘోర పరాజయం పాలైన నేపథ్యంలో భారత క్రికెట్ జట్టు కోచింగ్ స్టాఫ్‌పై వేటు పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. టీ20 సిరీస్‌లో జట్టు కనబరిచిన నిరాశాజనక ప్రదర్శనపై బీసీసీఐ కోచింగ్ స్టాఫ్, ఆటగాళ్ల ప్రదర్శనను నిశితంగా సమీక్షించనుంది. నిజానికి ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ కాంట్రాక్ట్ 2027 వరకు ఉన్నప్పటికీ, జట్టు ఇటీవలి పేలవమైన ఆటతీరుతో ఆయన పదవికే ముప్పు పొంచి ఉందని బీసీసీఐ వర్గాలు చెబుతున్నాయి. శ్రేయస్ అయ్యర్ కెప్టెన్సీలో టీమిండియా బ్యాక్-టు-బ్యాక్ రెండు టీ20 సిరీస్‌లను కోల్పోయింది. మొదట ఐర్లాండ్ చేతిలో 2-0తో వైట్‌వాష్ అయిన భారత జట్టు, ఇప్పుడు ఇంగ్లండ్‌తో జరుగుతున్న ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లోనూ 3-0తో వెనుకబడి సిరీస్‌ను చేజార్చుకుంది. భారత్-ఇంగ్లండ్ మధ్య ఇప్పటివరకు నాలుగు మ్యాచ్‌లు జరగ్గా.. అందులో తొలి మ్యాచ్ వర్షం కారణంగా రద్దయిన సంగతి తెలిసిందే. ఇంగ్లండ్ పర్యటనలో మేనేజ్‌మెంట్ తీసుకున్న కొన్ని వివాదాస్పద నిర్ణయాల వల్లే బీసీసీఐ ఈ సమీక్షకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. ముఖ్యంగా స్టార్ వికెట్ కీపర్ బ్యాటర్ సంజు శాంసన్‌ను జట్టు నుండి తప్పించడంపై మేనేజ్‌మెంట్‌పై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. ఇంగ్లండ్‌తో జరిగిన మొదటి టీ20 తర్వాత శాంసన్‌ను పక్కన పెట్టారు. అతని స్థానంలో వైభవ్ సూర్యవంశీని ఓపెనర్‌గా బరిలోకి దించినప్పటికీ, అతడు ఆశించిన స్థాయిలో రాణించలేకపోయాడు. మరోవైపు ఇషాన్ కిషన్, తిలక్ వర్మల ఫామ్ కూడా టీమిండియాకు పెద్ద తలనొప్పిగా మారింది. ఐర్లాండ్ సిరీస్‌తో కలుపుకొని ఈ మొత్తం పర్యటనలో తిలక్ వర్మ బ్యాటింగ్‌లో ఘోరంగా విఫలమయ్యాడు. అయితే, వరుసగా ఫెయిల్ అవుతున్నప్పటికీ కేవలం వైస్ కెప్టెన్ (ఉప-కెప్టెన్) అనే ఒకే ఒక్క కారణంతోనే తిలక్ వర్మను జట్టు నుండి తప్పించడం లేదా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇక ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్‌లో టాప్ ప్లేయర్‌గా ఉన్న ఇషాన్ కిషన్ సైతం ఇంగ్లండ్‌లోని పిచ్‌ల స్వింగ్, బౌన్స్‌ను తట్టుకోలేక పరుగులు చేయడానికి తీవ్రంగా శ్రమిస్తున్నాడు.

# బిగ్‌బాష్ లీగ్‌కు ఆతిథ్యం ఇవ్వనున్న చెన్నై నగరం



ఈ ఏడాది డిసెంబర్‌లో ప్రారంభం కానున్న బిగ్ బాష్ లీగ్ (2026-27 సీజన్) ప్రారంభ మ్యాచ్‌కు భారతదేశంలోని చెన్నై నగరం ఆతిథ్యం ఇవ్వనుంది. తద్వారా భారత్‌లో ఒక మ్యాచ్‌ను నిర్వహించబోతున్న తొలి విదేశీ క్రికెట్ లీగ్‌గా బిగ్ బాష్ లీగ్ రికార్డు నెలకొల్పనుంది. ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్న భారత ప్రధాని నరేంద్ర మోదీ, ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్‌తో కలిసి మెల్బోర్న్ క్రికెట్ గ్రౌండ్‌లో శుక్రవారం ఈ చరిత్రాత్మక ప్రకటనను అధికారికంగా వెల్లడించారు. డిసెంబర్ 12న చెన్నైలోని ఐకానిక్ 'ఎమ్ఏ చిదంబరం స్టేడియం' (చేపాక్) లో జరిగే ఈ ఓపెనింగ్ మ్యాచ్‌లో మెల్బోర్న్ రెనెగేడ్స్, పెర్త్ స్కార్చర్స్ జట్లు తలపడనున్నాయి. డిసెంబర్ నెలలో భారతదేశం అంతటా జరగనున్న వారం రోజుల పాటు సాగే ఆస్ట్రేలియా సాంస్కృతిక, వ్యాపార, క్రీడా ఉత్సవం 'జీ డే నమస్తే'లో ఈ బిగ్ బాష్ లీగ్ మ్యాచ్ ఒక ప్రధాన ఆకర్షణగా నిలవనుందని ఆస్ట్రేలియా ప్రధాని అల్బనీస్ పేర్కొన్నారు. ఇరు దేశాల మధ్య క్రీడలు, సాంకేతికత, పెట్టుబడులను పెంపొందించేందుకు కుదిరిన 'సహకార రోడ్‌మ్యాప్' లో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నారు. "భారతదేశం అంతటా, ముఖ్యంగా చెన్నైలో అద్భుతమైన క్రికెట్ ప్రేమికులు ఉన్నారు. చేపాక్ స్టేడియంలో మ్యాచ్‌కు భారీ సంఖ్యలో ప్రేక్షకులు వస్తారని మేము ఆశిస్తున్నాము" అని బిగ్ బాష్ లీగ్ ఎగ్జిక్యూటివ్ జనరల్ మేనేజర్ అలిస్టర్ డోబ్సన్ సంతోషం వ్యక్తం చేశారు.

# ఆఖరి టీ20కి భారత జట్టులో భారీ మార్పులు

## రీఎంట్రీ ఇవ్వనున్న సంజూ శాంసన్



ఇంగ్లండ్ పర్యటనలో వరుస పరాజయాలతో సిరీస్ కోల్పోయిన టీమిండియా నామమాత్రపు ఆఖరి టీ20కి సిద్ధమైంది. శనివారం సౌతాంప్టన్ వేదికగా జరిగే ఈ మ్యాచ్‌లో గెలుపే లక్ష్యంగా శ్రేయస్ అయ్యర్ సారథ్యంలోని టీమిండియా బరిలోకి దిగుతోంది. కనీసం ఈ మ్యాచ్‌లోనైనా గెలిచి పరువు కాపాడుకోవాలని టీమిండియా భావిస్తోంది. మరోవైపు ఈ మ్యాచ్ కూడా గెలిచి అంతర్జాతీయ టీ20 ర్యాంకింగ్స్‌లో భారత్‌ను వెనక్కినెట్టి అగ్రస్థానాన్ని కైవసం చేసుకోవాలనే పట్టుదలతో ఇంగ్లండ్ ఉంది. నాలుగో టీ20 విజయానంతరం ఇంగ్లండ్ కెప్టెన్ హ్యారీ బ్రూక్ ఇదే విషయాన్ని తెలియజేశాడు. టీ20ల్లో అగ్రస్థానాన్ని అందుకోవడమే తమ లక్ష్యమని చెప్పాడు. దాంతో ఈ మ్యాచ్ హోరాహోరీగా సాగే అవకాశం ఉంది. పేలవ బ్యాటింగ్, చెత్త బౌలింగ్‌తో వరుస పరాజయాలను మూటగట్టుకున్న టీమిండియా.. ఆఖరి మ్యాచ్‌లో భారీ మార్పులు చేసే అవకాశం ఉంది. సంజూ శాంసన్ స్థానంలో వరుసగా మూడు మ్యాచ్‌లు ఆడి తీవ్రంగా నిరాశపర్చిన వైభవ్‌ను పక్కనపెట్టవచ్చు. లేదంటే అతన్ని కొనసాగించి ఇషాన్ కిషన్‌పై వేటు వేసి సంజూ శాంసన్‌ను ఫస్ట్ డౌన్‌లో ఆడించవచ్చు. ఏది ఏమైనా సంజూ శాంసన్ రీఎంట్రీ ఇవ్వడం ఖాయంగా కనిపిస్తోంది. అవసరమైతే అభిషేక్ శర్మకే రెస్ట్ ఇవ్వవచ్చు. ఇషాన్ కిషన్ కూడా ఐర్లాండ్‌తో పాటు ఇంగ్లండ్‌తో సిరీస్‌లో తీవ్రంగా నిరాశపర్చాడు. ఐర్లాండ్‌తో రెండు టీ20ల్లో 1, 12 పరుగులు చేసిన ఇషాన్.. ఇంగ్లండ్‌తో సిరీస్‌లో వరుసగా 0, 49, 13, 4 పరుగులు చేసి తీవ్రంగా నిరాశపర్చాడు. రెండో టీ20లో 49 పరుగులు చేసినా స్లోగా బ్యాటింగ్ చేసి విమర్శలపాలయ్యాడు. శివమ్ దూబే కూడా స్థాయికి తగ్గ ప్రదర్శన చేయలేదు. అతన్ని తప్పించాలనుకుంటే యువ ఆల్‌రౌండర్ సూర్యాన్ష్ షెడ్జే తుది జట్టులోకి వస్తాడు. వైస్ కెప్టెన్ తిలక్ వర్మ కూడా దారుణంగా విఫలమయ్యాడు. టాపార్డర్‌ను కొనసాగించాలనుకుంటే సంజూ శాంసన్ కోసం తిలక్‌పై వేటు వేయవచ్చు. లేదంటే శివమ్ దూబేను కొనసాగించి సూర్యాన్ష్ కోసం తిలక్‌ను తప్పించవచ్చు. ఇంగ్లండ్‌తో సిరీస్‌లో తిలక్ వర్మ వరుసగా 13, 24, 3, 11 పరుగులే చేశాడు. ఇప్పటికే అతనిపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.అక్షర్ పటేల్ స్పిన్ ఆల్‌రౌండర్‌గా కొనసాగనుండగా.. వరుణ్ చక్రవర్తి గాయం నుంచి కోలుకుంటే బరిలోకి దిగుతాడు. లేదంటే వాషింగ్టన్ సుందర్ జట్టులో కొనసాగుతాడు. పేస్ బౌలర్లుగా ప్రిన్స్ యాదవ్, అర్ష్‌దీప్ సింగ్, ప్రసిధ్ కృష్ణ బరిలోకి దిగనున్నారు. హర్షిత్ రాణా కోలుకుంటే ప్రసిధ్ కృష్ణపై వేటు పడనుంది.ఇంగ్లండ్‌తో ఆఖరి టీ20కి భారత తుది జట్టు(అంచనా)వైభవ్ సూర్యవంశీ, అభిషేక్ శర్మ, సంజూ శాంసన్/ఇషాన్ కిషన్, శ్రేయస్ అయ్యర్, శివమ్ దూబే, తిలక్ వర్మ/సూర్యాన్ష్ షెడ్జే, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్/వరుణ్ చక్రవర్తి, హర్షిత్ రాణా/ప్రసిధ్ కృష్ణ, ప్రిన్స్ యాదవ్, అర్ష్‌దీప్ సింగ్.

# వైభవ్ సూర్యవంశీకి చాలా అద్భుతమైన భవిష్యత్తు ఉంది

## • సూర్యవంశీ వైఫల్యంపై ధోనీ సంచలన వ్యాఖ్యలు

భారత క్రికెట్ దిగ్గజం మహేంద్ర సింగ్ ధోనీ, ప్రస్తుత సంచలన యువ ఆటగాడు వైభవ్ సూర్యవంశీ ఇద్దరూ బీహార్ రాష్ట్రానికి చెందినవారే. ఒకరు ప్రపంచ క్రికెట్‌ను శాసిస్తే, మరొకరు 15 ఏళ్ల ప్రాయంలోనే ఎంతో గుర్తింపు తెచ్చుకున్నారు. ప్రస్తుతం ఇంగ్లాండ్ పర్యటనలో వైభవ్ వరుస వైఫల్యాలతో సతమతమవుతున్న వేళ, అతని ఆటతీరుపై ధోనీ తొలిసారి స్పందించారు.రాజస్థాన్ రాయల్స్ జట్టు తరపున ఐపీఎల్‌లో మెరుపులు మెరిపించిన 15 ఏళ్ల యువ సంచలనం వైభవ్ సూర్యవంశీకి ఇంగ్లాండ్ పర్యటన పెద్దగా కలిసిరావడం లేదు. ఇంగ్లాండ్‌తో జరిగిన రెండో టీ20 మ్యాచ్ ద్వారా అంతర్జాతీయ అరంగేట్రం చేసిన వైభవ్, ఇక్కడి పిచ్‌లపై పరుగులు సాధించడానికి తీవ్రంగా శ్రమిస్తున్నాడు. ఇప్పటివరకు ఆడిన మూడు మ్యాచ్‌ల్లో కేవలం 14 సగటుతో 42 పరుగులు మాత్రమే చేయగలిగాడు. శ్రీలంకలో జరిగిన త్రైపాక్షిక సిరీస్‌లో 200 పైగా స్ట్రైక్ రేట్‌తో, కేవలం 29 బంతుల్లో 94 పరుగులు చేసి రికార్డులు సృష్టించిన ఈ యువ ఆటగాడి ఫామ్ ఒక్కసారిగా పడిపోవడం అభిమానులను తీవ్ర నిరాశకు గురిచేస్తోంది.క్రికెట్ ప్రపంచంలో వైభవ్ ప్రదర్శనపై చర్చ జరుగుతున్న వేళ, ధోనీ పుట్టినరోజు సందర్భంగా క్రీడా జర్నలిస్ట్ విమల్ కుమార్ ఆయనను కలిశారు. ఒకే రాష్ట్రానికి చెందిన వైభవ్‌ను ఎప్పుడైనా కలిశారా అని ప్రశ్నించగా ధోనీ ఆసక్తికర సమాధానం ఇచ్చారు. తామిద్దరం అధికారికంగా ఎప్పుడూ కలుసుకోలేదని, కానీ ఒకసారి అనుకోకుండా ఒకరినొకరు దాటుకుంటూ వెళ్లామని, మాట్లాడుకునే అవకాశం రాలేదని ధోనీ స్పష్టం చేశారు. అయితే వైభవ్ ఆటపై స్పందిస్తూ.. "వైభవ్ సూర్యవంశీకి చాలా అద్భుతమైన భవిష్యత్తు ఉంది. ప్రపంచమంతా అతని ఆటను గమనిస్తోంది. అంతర్జాతీయ స్థాయిలో రాణించగల అద్భుతమైన నైపుణ్యం ఆ కుర్రాడిలో ఉంది" అంటూ ధోనీ కొనియాడారు. వరుస వైఫల్యాలతో ఇబ్బంది పడుతున్న యువ ఆటగాడికి ధోనీ ఇచ్చిన ఈ మద్దతు పెద్ద ఊరటనిస్తుందనడంలో సందేహం లేదు.భారతదేశంలోని ఫ్లాట్ పిచ్‌లపై అలవోకగా సిక్సర్లు బాదిన వైభవ్‌కు ఇంగ్లాండ్ పిచ్‌లపై ఉన్న అదనపు బౌన్స్ పెద్ద శాపంగా మారింది. ఇంగ్లాండ్ ఫాస్ట్ బౌలర్ల వేగాన్ని, పిచ్ నుంచి ఊహించని విధంగా వస్తున్న బౌన్స్‌ను ఎదుర్కోవడంలో వైభవ్ పొరపాట్లు చేస్తున్నాడు. షార్ట్ పిచ్ బంతులను సరిగ్గా అంచనా వేయలేక చెత్త షాట్లకు యత్నిస్తూ వికెట్ పారేసుకుంటున్నాడు. అయితే ఈ ఇబ్బంది కేవలం వైభవ్‌కు మాత్రమే కాదు, భారత సీనియర్ బ్యాటర్లను సైతం ఇంగ్లాండ్ బౌలర్లు ముప్పతిప్పలు పెడుతున్నారు. వికెట్ కీపర్ బ్యాటర్ ఇషాన్ కిషన్ సైతం ఇంగ్లాండ్, ఐర్లాండ్ పర్యటనల్లో ఘోరంగా విఫలమయ్యాడు.ఈ సిరీస్‌లో శ్రేయాస్ అయ్యర్ మాత్రమే నాలుగు మ్యాచ్‌ల్లో 190 పరుగులతో ఒంటరి పోరాటం చేశాడు. అభిషేక్ శర్మ వేగంగా ఆడుతున్నప్పటికీ పెద్ద ఇన్నింగ్స్‌లు ఆడలేకపోతున్నాడు. ఇషాన్ కిషన్ 4 మ్యాచ్‌ల్లో కేవలం 16.5 సగటుతో 66 పరుగులు మాత్రమే చేసి తీవ్రంగా నిరాశపరిచాడు. ఇప్పటికే భారత జట్టు సిరీస్‌ను కోల్పోయినప్పటికీ, జులై 11న సౌతాంప్టన్ వేదికగా జరిగే చివరి మ్యాచ్‌లో టీమ్ మేనేజ్‌మెంట్ వైభవ్‌కు మరో అవకాశం ఇవ్వాలని భావిస్తోంది.



# ఫ్రాన్స్ సెమీఫైనల్ బెర్త్‌ను ఖరారు

## • 2-0 గోల్స్ తేడాతో మొరాకోను మట్టికరిపించిన ఫ్రాన్స్

ఫిఫా వరల్డ్ కప్-2026 సీజన్‌లో ఫ్రాన్స్ జోరు ఏమాత్రం తగ్గడం లేదు. ఫ్రాన్స్ జట్టు మరోసారి తన విశ్వరూపాన్ని ప్రదర్శించింది. ఉత్కంఠభరితంగా సాగిన నాకౌట్ పోరులో2-0 గోల్స్ తేడాతో మొరాకోను మట్టికరిపించింది. ఈ గెలుపుతో సెమీఫైనల్ బెర్త్‌ను ఖరారు చేసుకుంది. ఫ్రాన్స్ స్టార్ స్ట్రైకర్ కిలియన్ ఎంబాపె అద్భుతమైన ఆట తీరును ప్రదర్శించాడు. ఈ ఘన విజయంతో ప్రపంచకప్ చరిత్రలో వరుసగా మూడోసారి (2018, 2022, 2026) సెమీఫైనల్‌కు చేరిన జట్టుగా ఫ్రాన్స్ సరికొత్త రికార్డు సృష్టించింది. మ్యాచ్ ఆరంభం నుంచే ఫ్రాన్స్ మైదానంలో దూకుడును ప్రదర్శించింది. బంతిని ఎక్కువసేపు తమ ఆధీనంలో ఉంచుకుంటూ ఆటపై పట్టు సాధించింది. ఈ క్రమంలో గోల్ చేయడానికి 30వ నిమిషంలో ఫ్రాన్స్ ఆశించిన అవకాశం లభించింది. స్టార్ ప్లేయర్ ఎంబాపె మొరాకో డిఫెన్స్‌ను దాటుకుంటూ బాక్స్ లోపలికి దూసుకెళ్లగా, మొరాకో డిఫెండర్ నౌసైర్ మజ్రావోయి అతడిని కిందపడేశాడు. దీనితో రెఫరీ ఫ్రాన్స్‌కు పెనాల్టీని ప్రకటించారు. ఎంబాపె షాట్ కొట్టగా, మొరాకో గోల్‌కీపర్ యాసిన్ బోనో అద్భుతమైన డైవ్‌తో ఎంబాపె కొట్టిన బంతిని చాలా సులువుగా పట్టుకుని ఫ్రాన్స్ సంబరాలను అడ్డుకున్నాడు. ఫస్టాఫ్ ముగిసే సమయానికి ఇరు జట్ల స్కోరు 0-0తో సమంగా నిలిచాయి. సెకండాఫ్‌లో మొరాకో జట్టు వ్యూహాత్మకంగా పుంజుకోవడానికి ప్రయత్నించింది. కానీ, ఫ్రాన్స్ ఆ జట్టును నిలువరించింది. మ్యాచ్ 60వ నిమిషంలో ఫ్రాన్స్ స్టార్ ఆటగాడు ఎంబాపె, బాక్స్ పైభాగం నుంచి బంతిని నెట్ ఫార్ కార్నర్‌లోకి పంపాడు. గోల్‌కీపర్ బోనో ఎంత ప్రయత్నించినా ఆ బంతిని ఆపలేకపోయాడు. ఈ అద్భుతమైన గోల్‌తో ఫ్రాన్స్ 1-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. మొదటి గోల్ వచ్చిన ఉత్సాహంలో ఫ్రాన్స్ మరింత వేగంగా కదిలింది. మొరాకో జట్టు కోలుకునే లోపే ఉస్మాన్ డెంబెలే మ్యాచ్ మైలురాయిని మార్చేశాడు. దూయే అందించిన పాస్‌ను అందుకున్న డెంబెలే బంతిని నెట్ బాట పట్టించాడు. దీంతో ఫ్రాన్స్ ఆధిక్యం 2-0కు చేరింది. రెండు గోల్స్ వెనుకబడిన మొరాకో మ్యాచ్‌లోకి తిరిగి రావడానికి తమ స్టార్ ఆటగాళ్లు సోఫియాన్ రహిమి, సోఫియాన్ అమ్రబాత్, జకారియా ఎల్ ఊహాదీలను సబ్‌స్టిట్యూట్‌లుగా రంగంలోకి దించింది. కానీ, ఫలితం లేకుండా పోయింది. మ్యాచ్ చివరి పది నిమిషాల్లో మొరాకో గోల్ కోసం సర్వశక్తులూ ఒడ్డింది. చివరి నిమిషాల్లో ఫ్రాన్స్ తరపున సబ్‌స్టిట్యూట్‌గా వచ్చిన మాతెటా,బార్కోలా జోడి మూడో గోల్ కోసం గట్టి ప్రయత్నం చేసింది. కానీ, అది సాధ్యం కాలేదు. దీంతో 2-0తో ఫ్రాన్స్ విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో చేసిన గోల్‌తో కెప్టెన్ కిలియన్ ఎంబాపె అంతర్జాతీయ ఫుట్‌బాల్‌లో పలు మైలురాళ్లను అందుకున్నాడు. ఫ్రాన్స్ ఫుట్‌బాల్ చరిత్రలోనే అంతర్జాతీయ మ్యాచ్‌ల్లో నేరుగా 100 గోల్స్‌లో భాగస్వామ్యాన్ని పంచుకున్న మొదటి ఆటగాడిగా ఎంబాపె నిలిచాడు. ఇంటర్నేషనల్ కెరీర్‌లో ఫ్రాన్స్ తరపున అతను ఇప్పటివరకు వ్యక్తిగతంగా 64 గోల్స్ చేయడమే చేశాడు. అలాగే, 36 గోల్స్ అసిస్ట్‌లు అందించాడు. దీంతో 100 గోల్స్ మైలురాయిని అందుకున్నాడు. 2018, 2022, 2026 ఎడిషన్లన్నింటిలో కలిపి ఎంబాపె ప్రపంచకప్‌లో తన మొత్తం గోల్స్ సంఖ్యను 20కి పెంచుకున్నాడు. వరల్డ్ కప్‌లో అత్యధిక గోల్స్ చేసిన లియోనెల్ మెస్సీ (21 గోల్స్) ఆల్-టైమ్ రికార్డుకు ఎంబాపె కేవలం ఒక్క గోల్ దూరంలో ఉన్నాడు.



# స్మృతి మంధాన 'ట్రిపుల్ సెంచరీ'!




టీమిండియా వైస్ కెప్టెన్ స్మృతి మంధాన చరిత్ర సృష్టించింది. అంతర్జాతీయ మహిళల క్రికెట్‌లో 300 మ్యాచ్‌ల మైలురాయి అందుకున్న అతి పిన్న వయస్కురాలిగా నిలిచింది. ప్రతిష్ఠాత్మక లార్డ్స్ మైదానం వేదికగా ఇంగ్లండ్‌తో జరుగుతున్న ఏకైక టెస్ట్ ద్వారా 29 ఏళ్ల స్మృతి మంధాన ఈ ఫీట్ సాధించింది. ఓవరాల్‌గా ఈ ఘనతను అందుకున్న 12వ మహిళా క్రికెటర్‌గా గుర్తింపు పొందింది.ఈ మ్యాచ్ ప్రారంభానికి ముందు ఈ రికార్డ్ గురించి మాట్లాడుతూ.. స్మృతి మంధాన సంతోషం వ్యక్తం చేసింది. గత రాత్రే తనకు ఈ రికార్డ్ గురించి తెలిసిందని వెల్లడించింది. లార్డ్స్ వేదికగా 2017 మహిళల వన్డే ప్రపంచకప్ ఫైనల్ ఆడిన విషయాన్ని, ఆ కఠిన టోర్నీ తర్వాత తన భవిష్యత్తుపై నెలకొన్న అనిశ్చితిని గుర్తు చేసుకుంది.'గత రాత్రే నేను 300వ అంతర్జాతీయ మ్యాచ్ ఆడబోతున్నాననే విషయం తెలిసింది. ఓ ప్లేయర్‌గా ప్రతీ ఫార్మాట్‌లో ఎన్ని మ్యాచ్‌లు ఆడామనే విషయాన్ని లెక్కించుకోలేం. లార్డ్స్ వేదికగా ఆడిన 2017 ప్రపంచకప్ ఫైనల్ నాకు ఇంకా గుర్తుంది. ఆ ప్రపంచకప్‌లో నేను సరిగ్గా ఆడలేదు. నాకు మళ్లీ టీమిండియా తరపున ఆడే అవకాశం లభిస్తుందా? అని అప్పుడు అనిపించింది. అలాంటి పరిస్థితుల నుంచి పుంజుకొని ఇప్పుడు లార్డ్స్ మైదానంలో 300వ అంతర్జాతీయ మ్యాచ్ ఆడటం కంటే గొప్ప విషయం మరొకటి లేదు.లార్డ్స్ వేదికగానే టీ20 ప్రపంచకప్ సెమీస్ చేరే అవకాశం మాకులభించింది. కానీ ఆ అవకాశాన్ని మేం సద్వినియోగం చేసుకోలేకపోయాం. కానీ ఇది క్రికెట్. ముందుకు సాగాల్సిందే.

VOICE OF THE PEOPLE-POWER OF TRUTH
తెలుగు వార్తా దినపత్రిక

# కొత్త కథనంతో వచ్చిన లెనిన్

## అఖిల్ నటనా తీరు అద్భుతం





టైటిల్ ప్రకటించిన నాటి నుంచీ అఖిల్ 'లెనిన్' సినిమాపై అంచనాలు మొదలయ్యాయి. అఖిల్ రగ్గడ్ గెటప్, కథా నేపథ్యం, ప్రచార చిత్రాలు, విడుదలైన పాటలు.. ఇవన్నీ సినిమాపై ఆసక్తిని పెంచాయి. అక్కినేని నాగార్జున, సూర్యదేవర నాగవంశీ నిర్మాతలు కావడంతో కచ్చితంగా సినిమా బావుంటుందని ఆడియన్స్ ఫిక్సయిపోయారు. అఖిల్ కెరీర్‌లో 'లెనిన్'కి వచ్చినంత హైప్ మరే సినిమాకూ రాలేదన్నది నిజం. ఎట్టకేలకు ఈ శుక్రవారం 'లెనిన్'గా అఖిల్ థియేటర్లలోకి అడుగపెట్టాడు. ఇది రాయలసీమలోని రామాపురం అనే గ్రామం పగలకు, ప్రతీకారాలకు దూరంగా ఉంటుంది. రక్తం ఆ నేలను అప్పటివరకూ తాకలేదు. ఆ ఊరిలో సంప్రదాయ జాతర జరుగుతుండగా, ఓ పదేళ్ల పిల్లాడు ఆ ప్రాంతంలోకి అడుపెట్టాడు. అ పిల్లాడి పేరు 'లెనిన్'. అమ్మానాన్న లేని అనాథ అయిన లెనిన్‌ని ఆ ఊరి పెద్దావిడ(ఈశ్వరీరావు) అక్కున చేర్చుకుంది. ఆమె కొడుకైన వసంత్(ప్రమోద్ పంజు)తో లెనిన్‌కి బలమైన స్నేహబంధం ఏర్పడింది. వసంత్‌తో పాటు లెనిన్ కూడా ఆ ఇంట్లోనే పెరిగి పెద్దయ్యాడు.. కట్ చేస్తే.. కొన్నేళ్ల తర్వాత లెనిన్ జైలు నుంచి విడుదలయ్యాడు. ఆ ఊరిలోకి అడుగుపెట్టి ఆ ఊరి జనాలైన వందమందిని నరికి చంపాడు. చివరకు తన ప్రాణస్నేహితుడైన వసంత్‌ని కూడా అతి దారుణంగా పొడిచి చంపాడు. అసలు లెనిన్ జైలుకి ఎందుకెళ్లాడు? రక్తం రుచే తెలియని ఆ నేలపై రక్తపాతం ఎందుకు సృష్టించాడు? ప్రాణ స్నేహితుడైన వసంత్ ప్రాణాన్ని ఎందుకు బలి తీసుకున్నాడు? ఈ ప్రశ్నలకు సమాధానమే అసలు కథ.పరువు, ప్రేమ, స్నేహం, నమ్మకద్రోహం నేపథ్యంలో సాగే కథ ఇది. కథకుడు, దర్శకుడు మురళీకిశోర్ అబ్బూరి ఈ కథను నడిపించిన తీరు బావుంది. ఇదొక విభిన్నమైన స్క్రీన్‌ప్లే. ప్రథమార్థం ఇదేదో పరువు కోసం ప్రాణాలు తీసే వ్యక్తుల చుట్టూ తిరిగే కథగానే అంతా భావిస్తారు. కానీ సెకండాఫ్‌లో ఈర్ష్యా, ద్వేషం, నమ్మకద్రోహం కోణాలు కథలో బహిర్గతమవుతాయి. ఈర్ష్యా, ద్వేషం అనేవి పవిత్రమైన స్నేహాన్ని సైతం నిర్వీర్యం చేస్తాయని ఈ కథ ద్వారా మురళీకిశోర్ అబ్బూరి తెలిపారు. అనాధగా ఆ ఊరు వచ్చిన లెనిన్ 'నా' అనుకున్న వారందర్నీ సంపాదించుకున్నానని భ్రమ పడతాడు. తాను ఎప్పటికీ అనాథనేనని తెలుసుకుకోవడంతో కథ ముగుస్తుంది. స్నేహానికీ, ప్రేమకీ లొంగిపోయే లెనిన్ నమ్మకద్రోహానికి బలైపోయాడు. అదే ఈ సినిమా కథ. చాలా సీరియస్ స్జబెక్ట్ ఇది. క్షణక్షణానికి మారుతున్న వ్యక్తులు మనస్తత్వాలను ఈ సినిమాలో చూడొచ్చు. మంచి వాళ్లుగా కనిపిస్తున్న మేకవన్నె పులుల మధ్య జీవితాన్ని సాగించి, సర్వం కోల్పోయిన లెనిన్‌ని ఈ సినిమాలో చూడొచ్చు. ప్రథమార్థం చివరి ఇరవై నిమిషాల్లో సినిమాలోని అసలు కథ మొదలైంది. కథలోకి వెళ్లడం ఆలస్యం కావడం వల్ల కథనం నిదానించినట్టు అనిపిస్తుంది. ద్వితీయార్థం ఆద్యంతం ఊహించని మలుపులతో ఆసక్తికరంగా సినిమా సాగింది. మొత్తంగా దర్శకుడు మురళీకిశోర్ వైవిధ్యమైన కథనంతో ఈ కథను నడిపించి సినిమాను నిలబెట్టారు.ఇక 'లెనిన్'గా కొత్త అఖిల్‌ని ఈ సినిమాలో చూస్తారు. ఇప్పటివరకూ ఆయన చేసిన సినిమాలన్నీ ఒకెత్తూ, 'లెనిన్' ఒకెత్తు. అమాయకత్వం, మంచి తనం, మూర్ఖత్వం కలగలిసిన ఈ పాత్రలో అఖిల్ జీవించాడనే చెప్పాలి. అతనిలోని పరిపూర్ణమైన నటుడ్ని 'లెనిన్'లో చూడొచ్చు. ముఖ్యంగా ద్వితీయార్థంలో అఖిల్ అద్భుతంగా నటించాడు. అతని కెరీర్‌లో బెస్ట్ పెర్‌ఫార్మెన్స్‌గా 'లెనిన్'ని చెప్పొచ్చు. ఇక భాగ్యశ్రీబోర్సే తనదైన అందచందాలతోపాటు చక్కటి అభినయంతో కూడా ఆకట్టుకున్నది. ఈ సినిమాలో ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిన వసంత్‌గా నటించిన ప్రమోద్ పంజు గురించి. తనది ఇందులో మేకవన్నె పులి లాంటిపాత్ర. మంచివాడిగా కనిపిస్తూ ఉన్నట్టుండి దుర్మార్గుడిగా ఎస్టాబ్లిష్ అయ్యే పాత్ర అది. ఆ పాత్రలో తన నిజంగా అదరహో అనిపించాడు. ఈ సినిమాతో అతనికి మంచి పేరు రావడం ఖాయం. ఇక శివాజీ, ఈశ్వరీరావు, రాంకీ.. ఇలా అంతా పరిధిమేర పాత్రలకు న్యాయంచేశారు.

# షూటింగ్‌ల ఒత్తిడి నుంచి రెస్ట్

## యూరప్ టూర్ వెళ్లనున్న ప్రభాస్

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ ప్రస్తుతం వరుస క్రేజీ ప్రాజెక్టులతో ఫుల్ బిజీగా ఉన్న సంగతి తెలిసిందే. సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'స్పిరిట్', హను రాఘవపూడి డైరెక్షన్‌లో వస్తున్న 'ఫౌజీ' చిత్రాలతో పాటు బ్లాక్‌బస్టర్ హిట్స్ 'సలార్', 'కల్కి 2898 ' సీక్వెల్స్ కూడా ఆయన చేతిలో ఉన్నాయి. అయితే.. బ్యాక్ టు బ్యాక్ షూటింగ్‌లతో తీరిక లేకుండా గడుపుతున్న ప్రభాస్, త్వరలోనే కాస్త బ్రేక్ తీసుకోబోతున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ప్రభాస్ హైదరాబాద్‌లో 'స్పిరిట్' సినిమా షూటింగ్‌లో పాల్గొంటున్నారు. హీరో ప్రభాస్ మరియు హీరోయిన్ త్రిప్తి డిమ్రి పై కొన్ని కీలక సన్నివేశాలతో పాటు యాక్షన్ సీక్వెన్స్ చిత్రీకరిస్తున్నారు. ఇక స్పిరిట్ లేటెస్ట్ షెడ్యూల్ పూర్తయిన వెంటనే ప్రభాస్ ఒక చిన్న విరామం తీసుకోనున్నారు. సుమారు పదిరోజుల పాటు వెకేషన్ కోసం ఆయన యూరప్ వెళ్లనున్నట్లు సమాచారం. యూరప్ టూర్ ముగించుకుని తిరిగొచ్చిన తర్వాత, ప్రభాస్ తన పూర్తి ఫోకస్‌ను 'ఫౌజీ' సినిమాపై పెట్టనున్నట్టుగా తెలుస్తోంది. హను రాఘవపూడి దర్శకత్వంలో పీరియాడిక్ లవ్ స్టోరీగా రాబోతున్న ఈ చిత్రంతో ఇమాన్వి హీరోయిన్‌గా పరిచయమవుతోంది. ఇప్పటికే షూటింగ్ చివరి దశకు చేరుకోగా.. బ్యాలెన్స్ షూటింగ్‌ను కంప్లీట్ చేసే ఎ÷-లానింగ్‌లో ఉన్నాడు డార్లింగ్. ఆ తర్వాత స్పిరిట్ పూర్తి చేసి.. కల్కి 2 సెట్స్‌లో జాయిన్ అవనున్నాడు. ఇక ఆ తర్వాత సలార్ 2 సెట్స్ పైకి వెళ్లనుంది. ప్రస్తుతానికి ప్రభాస్ ఈ భారీ లైనప్‌తో బిజీగా ఉన్నాడు. అందుకే.. ఒక స్మాల్ బ్రేక్ తీసుకుంటున్నాడని చెప్పొచ్చు.



## కాజల్ మ్యాజిక్.. సింపుల్ లుక్‌కే సూపర్

టాలీవుడ్ చందమామ కాజల్ అగర్వాల్ గ్లామర్ పరంగానే కాకుండా, నటిగానూ సెకండ్ ఇన్నింగ్స్‌లో దూసుకుపోతోంది. తాజాగా ఈ బ్యూటీ ఐవరీ వైట్ కలర్ స్మోక్డ్ గౌనులో దిగిన క్లాసిక్ ఫోటోషూట్ నెట్టింట తెగ వైరల్ అవుతోంది. ఎంతో సింపుల్‌గా, అంతే ఈ లుక్‌లో కాజల్ అగర్వాల్ చాలా గ్రేస్‌ఫుల్‌గా కనిపించింది. తన స్మైల్‌తో మరింత ఆకట్టుకుంది. తల్లి అయిన తర్వాత సినిమాలు ఎంపిక చేసుకునే విషయంలో మరింత బాధ్యతగా ఉంటున్నానని ఆమె తాజాగా చెప్పింది.ఆ విశేషాలు చూద్దాం.. దేవకన్యలా మెరిసిన చందమామ: ప్రముఖ ఫ్యాషన్ బ్రాండ్ 'ప్లీట్స్ బై అరుణి' డిజైన్ చేసిన యాంకెల్ లెంత్ వైట్ డ్రెస్‌లో కాజల్ అగర్వాల్ ఎంతో అందంగా కనిపించింది. సెలబ్రిటీ స్టైలిస్ట్ అర్చన మెహతా ఈ లుక్‌ను చాలా రాయల్‌గా ప్లాన్ చేశారు. ఇక ఒక చేతిని తల వెనుకకు పెట్టుకుని, పెదవులపై చిన్న నవ్వుతో కాజల్ ఇచ్చిన పోజులు వింటేజ్ క్లాస్ లుక్‌ను గుర్తుచేస్తున్నాయి. మినిమల్ మేకప్, సింపుల్ ఇయర్ రింగ్స్ ఆమె అందాన్ని మరింత పెంచాయి.'ది ఇండియా స్టోరీ'తో కిచెన్‌నే మార్చేసింది: జూలై 24న రిలీజ్ కాబోతున్న 'ది ఇండియా స్టోరీ' సినిమాలో కాజల్ పవర్‌ఫుల్ లాయర్ పాత్రలో నటించింది. కల్తీ ఆహారం, పెస్టిసైడ్స్ బ్యాక్‌డ్రాప్‌లో వస్తున్న ఈ సినిమా కోసం చేసిన రీసెర్చ్ తనను షాక్‌కు గురిచేసిందని కాజల్ చెప్పింది. ఇక ఈ సినిమా కథ విన్నాక, తన కొడుకు ఆరోగ్యం కోసం తన సొంత వంటగదిలోని వస్తువులనే మార్చేశానని, మంచి కంటెంట్ ఉన్నందుకే ఈ సినిమా చేశానని వెల్లడించింది.కాజల్ తన కొడుకు నీల్ గురించి చెప్తూ ఆసక్తికరమైన విషయాలు పంచుకుంది. తన కొడుక్కి రామాయణం అంటే పిచ్చని, వాడికి రావణుడంటే ఇష్టమని, అందుకే తను మండోదరి పాత్ర చేస్తున్నట్లు చెప్పగానే వాడు ఎంతో ఖుషీ అయ్యాడని మురిసిపోయింది. ఇక థియేటర్లలో తన కొడుకు చూడబోయే మొదటి సినిమా ఇదేనని కాజల్ ఎమోషనల్ అయ్యింది.మగధీర, డార్లింగ్, లాంటి ఎన్నో బ్లాక్‌బస్టర్ సినిమాలతో సౌత్ ఇండస్ట్రీని ఏలిన కాజల్.. పెళ్లయ్యాక కూడా తన క్రేజ్ తగ్గలేదని నిరూపిస్తోంది. కేవలం కమర్షియల్ హంగుల కోసమే కాకుండా, తన కొడుకు గర్వపడేలా కంటెంట్ ఉన్న పాత్రలనే ఎంచుకుంటానని స్పష్టం చేసింది



# వరుణ్ తేజ్ 'కొరియన్ కనకరాజు'

## రిలీజ్ డేట్ వచ్చేసింది!




మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ కథానాయకుడిగా, దర్శకుడు మేర్లపాక గాంధీ రూపొందిస్తున్న హారర్ కామెడీ చిత్రం 'కొరియన్ కనకరాజు'. ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ సినిమా విడుదల తేదీని చిత్రబృందం శుక్రవారం అధికారికంగా ప్రకటించింది. ఈ చిత్రాన్ని 2026 ఆగస్ట్ 7న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి తీసుకురానున్నట్లు వెల్లడించింది. ఈ మేరకు వరుణ్ తేజ్ తన ఎక్స్ ఖాతాలో కొత్త పోస్టర్‌ను పంచుకుంటూ, "2026.. ఆగస్ట్ 7... ఎంటర్‌టైన్‌మెంట్ గ్యారెంటీ" అని పేర్కొన్నారు.భారీ బడ్జెట్‌తో రూపుదిద్దుకుంటున్న ఈ సినిమా... భారత్, కొరియా నేపథ్యంలో సాగే కథతో విభిన్నమైన హారర్ కామెడీగా ప్రేక్షకులను అలరించనుంది. ఈ చిత్రంలో వరుణ్ తేజ్ మునుపెన్నడూ చూడని వినూత్నమైన పాత్రలో కనిపించనున్నారని సమాచారం. ఇప్పటికే మార్చి నెలలో కొరియాలో వరుణ్ తేజ్, రితికా నాయక్, సత్యలపై కీలక సన్నివేశాలు, పాటలను చిత్రీకరించి చివరి షెడ్యూల్‌ను పూర్తి చేశారు. ఏప్రిల్‌లో విడుదలైన 'కమ్సహమ్నిదా' పాటకు మంచి స్పందన లభించింది.వరుణ్ తేజ్ పుట్టినరోజున విడుదలైన టైటిల్ గ్లింప్స్ సినిమాపై అంచనాలను భారీగా పెంచేసింది. గ్లింప్స్ ప్రకారం.. కనకరాజు అనే వ్యక్తి కోసం కొరియన్ పోలీసులు ఓ ఇండియన్ ఫొటోగ్రాఫర్‌ను చిత్రహింసలకు గురిచేస్తారు. ఇంతలో, ఓ పౌర్ణమి రాత్రి తన దేహంపై ఆత్మ ఆవహించిన కనకరాజు (వరుణ్ తేజ్) పోలీస్ స్టేషన్‌లోకి ప్రవేశించి, సమురాయ్ కత్తితో పోలీసులను అంతం చేస్తాడు. ఈ ఘటన చూసిన ఫొటోగ్రాఫర్, "ఈ కనకరాజు మన కనకరాజు కాదు" అనడంతో కథపై ఉత్కంఠ పెరిగింది.ఈ చిత్రానికి తమన్ సంగీతం అందిస్తుండగా, మనోజ్ రెడ్డి కాటసాని సినిమాటోగ్రఫీ, సత్య జి ఎడిటింగ్ బాధ్యతలు

# రోషన్ కనకాల కొత్త మూవీ ప్రారంభం




టాలీవుడ్ యువ నటుడు రోషన్ కనకాల కథానాయకుడిగా ఓ వినూత్నమైన భారీ ప్రాజెక్ట్ అధికారికంగా పట్టాలెక్కింది. గత చిత్రాలకు పూర్తి భిన్నంగా, సరికొత్త సైన్స్ ఫిక్షన్ రొమాంటిక్ కామెడీ కథాంశంతో తెరకెక్కనున్న ఈ చిత్రం హైదరాబాద్‌లో అత్యంత ఘనంగా పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. వైవిధ్యభరితమైన కథలను వెండితెరపై ఆవిష్కరించడంలో దిట్ట అయిన ప్రముఖ దర్శకుడు వి.ఐ. ఆనంద్ ఈ క్రేజీ ప్రాజెక్ట్‌కి కథ, స్క్రీన్‌ప్లే అందించడమే కాకుండా, స్వయంగా సమర్పకుడిగా వ్యవహరిస్తుండటం విశేషం. ఈ చిత్రంతో విజయ్ కె. కమిశెట్టి దర్శకుడిగా టాలీవుడ్‌కి పరిచయం అవుతున్నారు. సైన్స్ ఫిక్షన్, ఫాంటసీ, ప్రేమ, వినోదం వంటి అన్ని రకాల వాణిజ్య అంశాలను కలగలిపి ప్రేక్షకులను ఒక సరికొత్త ఊహాజనిత ప్రపంచంలోకి తీసుకెళ్లేలా ఈ కథను సిద్ధం చేశారు.ఈ చిత్రంలో రోషన్ కనకాల సరసన గహాజీ కథానాయికగా నటిస్తోంది. ఇక అత్యంత వైభవంగా జరిగిన ఈ ముహూర్తు వేడుకకు టాలీవుడ్ ప్రముఖులు హాజరై చిత్ర యూనిట్‌కు బెస్ట్ విషెస్ తెలియజేశారు. యువ హీరో నిఖిల్ సిద్దార్థ్ ముఖ్య అతిథిగా విచ్చేసి ముహూర్తపు షాట్‌కు క్లాప్ కొట్టగా, టాలీవుడ్ టాప్ సినిమాటోగ్రాఫర్ కె.కె. సెంథిల్ కుమార్ కెమెరా స్విచ్ ఆన్ చేసి చిత్ర బృందాన్ని ఆశీర్వదించారు. విజువల్ వండర్‌గా తెరకెక్కనున్న ఈ సినిమా టైటిల్‌ను మేకర్స్ ప్రస్తుతం సస్పెన్స్‌గా ఉంచారు, త్వరలోనే టైటిల్ మరియు పూర్తి నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను అధికారికంగా ప్రకటించనున్నారు. అన్ని హంగులు అద్దుకుని త్వరలోనే ఈ మూవీ రెగ్యులర్ షూటింగ్‌ను జరుపుకోనుంది.

# శ్రీ శ్రీ.. దుల్కర్ సల్మాన్, పూజా హెగ్డే కొత్త చిత్రానికి టైటిల్ ఫిక్స్

యూత్ ఆడియన్స్‌లో మంచి క్రేజ్ ఉన్న హీరో దుల్కర్ సల్మాన్, స్టార్ హీరోయిన్ పూజా హెగ్డే జంటగా నటిస్తున్న కొత్త సినిమాకు టైటిల్ ఖరారైంది. ఇప్పటివరకు ణు41గా పిలుస్తున్న ఈ చిత్రానికి "శ్రీ శ్రీ" అనే పేరును ఖరారు చేస్తూ చిత్రబృందం అధికారికంగా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేసింది. ఈ పోస్టర్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

కాలేజీ నేపథ్యంలో రూపొందించిన ఈ ఫస్ట్ లుక్‌లో దుల్కర్, పూజా హెగ్డే ఎంతో తాజాగా, రొమాంటిక్‌గా కనిపిస్తూ ఆకట్టుకుంటున్నారు. వీరిద్దరి మధ్య కెమిస్ట్రీ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. "ప్రేమ మళ్లీ చిగురిస్తుంది" (ూశీజవ ఔఅశ్రీశ్రీ ూజూఖతీఎ-ూాస్త్రుఅఅ) అనే ట్యాగ్‌లైన్‌ను పోస్టర్‌పై జోడించడంతో, ఇది ఒక ఆహ్లాదకరమైన ప్రేమకథా చిత్రంగా ఉండబోతోందని స్పష్టమవుతోంది.రవి నేలకూడిటి ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. సుధాకర్ చెరుకూరి తన ఎస్ఎల్‌వీ సినిమాస్ బ్యానర్‌పై 10వ చిత్రంగా దీన్ని నిర్మిస్తున్నారు. దుల్కర్ సల్మాన్, పూజా హెగ్డే తొలిసారి జతకడుతున్న ఈ సినిమాలో దీక్షిత్ శెట్టి, జగపతి బాబు, రమ్యకృష్ణ వంటి వారు కీలక పాత్రలు పోషిస్తున్నట్లు తెలుస్తోంది. జీవీ ప్రకాశ్ కుమార్ సంగీతం అందిస్తున్నారు. గతంలో ఈ సినిమా షూటింగ్ స్టిల్స్ ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తించగా, ఇప్పుడు విడుదలైన టైటిల్, ఫస్ట్ లుక్ అంచనాలను మరింత పెంచాయి.




"MANA VISHWAM" vide PRGI Registration No. "TGTEL/26/A4450" Printed by SRI VENKATESWARA PRINTING SOLUTIONS, Published by Nameendla Pramod on behalf of Nameendla Pramod, printed at 11-1/B/42, BPM GREEN LANDS COLONY, PRVATHAPUR, MEDIPALLY MANDAL AND DIVISION, GHMC, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500098 and published at H No 2-96, Geesugonda, Gorrekunta editor Nameendla Pramod. Gmail- manavishwamtelugudaily@gmail.com, Cell- 6305638569